షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక








సంపుటి : 1 సంచిక : 267 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 9 ఆగస్టు 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 267 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Friday 9 August 2024 PAGES : 8 PRICE : 5/-


# త్వరలో జన్మభూమి2

- త్వరలోనే మొదటి దశ నామినేటెడ్ పదవుల భర్తీ
- పొలిట్ బ్యూరో సమావేశంలో చంద్రబాబు కీలక నిర్ణయాలు
- తెలంగాణలో టీడీపీ పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలి
- పార్టీ సభ్యత్వ రుసుం రూ.100లతో ప్రారంభిస్తాం
- సభ్యత్వం తీసుకున్న వారు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షలు వచ్చే విధంగా పరిహారం
- చంద్రబాబు అధ్యక్షతన టీడీపీ పొలిట్ బ్యూరో సమావేశం..
- ఎన్‌టీఆర్ భవన్‌లో టీడీపీ పొలిట్ బ్యూరో సమావేశం
- జిల్లా యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణతో పాటు జన్మభూమి-2 ప్రారంభంపై చర్చ
- రాష్ట్రంలో పేదరిక నిర్మూలనపై విస్తృత చర్చ



**అమరావతి**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన టీడీపీ పొలిట్ బ్యూరో పార్టీ సమావేశం గురువారం నాడు మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలకు చంద్రబాబు పలు కీలక విషయాలపై దిశానిర్దేశం చేశారు. రెండున్నర గంటలపాటు ఈ సమావేశం సాగింది. నామినేటెడ్ పదవులపై చంద్రబాబు చర్చించారు. వీలైనంత త్వరగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. పొలిట్ బ్యూరో సమవేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను మీడియాకు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. "దక్షిణ భారతదేశంలో జనాభా నిష్పత్తి రోజురోజుకూ తగ్గుతుంది. జనాభా నిష్పత్తి తగ్గడంతో కేంద్రం నుంచి వచ్చే నిధులు సైతం తగ్గుతాయి. తెలంగాణలో టీడీపీ పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలి. పార్టీ సభ్యత్వ రుసుం రూ.100లతో ప్రారంభిస్తాం. సభ్యత్వం తీసుకున్న వారు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షలు వచ్చే విధంగా పరిహారం ఇవ్వాలని నిర్ణయించారు. పేదరిక నిర్మూలనపై ప్రధానంగా చంద్రబాబు చర్చించారు. త్వరలో - మిగతా3లో



## టీడీపీ ప్రలోభాలకు లొంగవద్దు

- ఎమ్మెల్సీగా బొత్స సత్యనారాయణను గెలిపించండి
- నర్సీపట్నం నియోజకవర్గ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో వైయస్ జగన్
- ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల్లో 600కు పైగా స్థానాల్లో మనం గెలిస్తే.. టీడీపీ వాళ్ల కేవలం 200కు పైగా స్థానాల్లోనే గెల్చారు
- వారికి, మనకు దాదాపుగా 387 స్థానాల తేడా ఉంది.
- నేను నా జీవితంలో విలువలు, విశ్వసనీయతతో కూడిన రాజకీయమే చేశాను.
- 10 శాతం ప్రజలు బాబు మాటలు నమ్మారు..

## జగన్‌ను ఆ పార్టీ నేతలే భరించలేకపోతున్నారు

- మంత్రి అనగాని సత్యప్రసాద్
- జగన్‌ను రాష్ట్ర ప్రజలు మాత్రమే కాదు.. ఆయన పార్టీ నేతలు కూడా వద్దనుకుంటున్నారు
- పోలోమని పెద్ద సంఖ్యలో వైసీపీ నేతలు రాజీనామాలు చేసి ఇతర పార్టీల్లో చేరుతున్నారు
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ వైసీపీకి ఓటమి ఖాయం



## పెండింగ్ నిధులు విడుదల చేయాలి

- కేంద్రమంత్రులను కలిసిన నాదెండ్ల మనోహర్..
- ప్రస్తుతం ఉన్న ఎన్ఎఫ్ఎస్ఏ కవరేజ్ కాకుండా లబ్ధిదారుల కవరేజీని మరింత పెంచాలని
- రాష్ట్రంలో మరో 8 ప్రైస్ రిపోర్టింగ్ కేంద్రాలను పెంచేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి
- 60 లక్షల దీపం కనెక్షన్లను పీఎమ్‌యూవై పథకం కింద వచ్చే విధంగా మార్చడి చేయాలి
- దేశవ్యాప్తంగా కందిపప్పు కొరత ఎక్కువగా ఉంది
- లక్ష మెట్రిక్ టన్నుల కందిపప్పు కేటాయించాలి





## ఆటవిక రాజ్యం కొనసాగుతోంది

- ఏపీలో లా అండ్ ఆర్డర్ దారుణంగా పడిపోయింది..
- అసలు రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నట్టా? లేనట్టా?
- రాష్ట్రాన్ని మణిపూర్, బీహార్‌లాగ మార్చారని విమర్శలు
- రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోంది
- మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలు

**అమరావతి**

ఏపీలో లా అండ్ ఆర్డర్ దారుణంగా పడిపోయిందని మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... ఒంటేరు నాగరాజు అనే వైసీపీ - మిగతా3లో

## రైతులకు విత్తనాల కొరత లేకుండా చూడాలి



- వ్యవసాయ శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు
- నూటికి నూరు శాతం ఈ-క్రాప్ నమోదు చేయాలి
- జులైలో భారీవర్షాలకు దెబ్బతిన్న పంటలకు రూ.36 కోట్లు ఇన్ పుట్ సబ్సీడీ
- రాష్ట్రంలో డ్రోన్ టెస్టింగ్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు
- రాష్ట్రంలో మైక్రో ఇరిగేషన్ పరికరాల తయారీకి మానుఫ్యాక్చరింగ్ పార్కు ఏర్పాటు

**అమరావతి**

వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలపై సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ఆదేశాలు జారీ చేశారు. రైతులకు విత్తనాల కొరత లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నూటికి నూరు శాతం ఈ-క్రాప్ నమోదు చేయాలని, జులైలో భారీవర్షాలకు దెబ్బతిన్న పంటలకు రూ.36 కోట్లు ఇన్ పుట్ సబ్సీడీ అందివ్వాలని కోరారు. పొలాల్లో పురుగు మందులు పిచికారికి డ్రోన్లు వినియోగించేలా ప్రోత్సహించాలని, రాష్ట్రంలో డ్రోన్ టెస్టింగ్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో మైక్రో ఇరిగేషన్ పరికరాల తయారీకి మానుఫ్యాక్చరింగ్ - మిగతా3లో



## హీరోలు స్మగ్లింగ్ చేసే పాత్రలు చేస్తున్నారు

- పవన్ కల్యాణ్ ఆసక్తికర వ్యాఖ్యలు!
- కర్ణాటకలో మీడియాతో మాట్లాడిన పవన్ కల్యాణ్
- 40 ఏళ్ల క్రితం హీరో అనేవాడు అడవులను కాపాడే వాడని వ్యాఖ్య
- ఇప్పుడు అడవుల్లోని చెట్లను నరికి స్మగ్లింగ్ చేస్తున్నాడన్న జనసేనాని
- ఇలాంటి చిత్రాల్లో నటించడానికి తాను చాలా ఇబ్బంది పడతానన్న పవన్

# టీడీపీ ప్రలోభాలకు లొంగవద్దు

**అమరావతి :** తెలుగుదేశం పార్టీ చేస్తున్న ప్రలోభాలకు ఎవ్వరూ లొంగవద్దని మాజీ సీఎం, వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి సూచించారు. గురువారం నర్సీపట్నం నియోజకవర్గం స్థానిక సంస్థల పార్టీ ప్రజా ప్రతినిధుల వైయస్ జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన పార్టీ తరపున ఎన్నికైన జడ్పీటీసీలు, ఎంపీటీసీలు అంతా ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న బొత్స సత్యనారాయణను గెలిపించాలని కోరారు. మామూలుగా అయితే ఇప్పుడు జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలో తెలుగుదేశం పార్టీతో పాటు నైతిక విలువలు ఉన్న ఏ పార్టీ అయినా పోటీ పెట్టకూడదు. కారణం ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల్లో 600కు పైగా స్థానాల్లో మనం గెలిస్తే.. టీడీపీ వాళ్లు కేవలం 200కు పైగా స్థానాల్లోనే గెల్చారు. వారికి, మనకు దాదాపుగా 387 స్థానాల తేడా ఉంది. కానీ, ఇక్కడ చంద్రబాబునాయుడు మాత్రం తన నైజం చూపిస్తూనే ఉన్నాడు. ఈ రోజుకి కూడా అధర్మంగా యుద్ధం చేసే కార్యక్రమంలో భాగంగా మన పార్టీ తరపున గెలిచిన వాళ్లకు ఫోన్లు చేసి ప్రలోభపెడుతున్నారు. మనుషులను పంపించిన మరీ మీకు రూ.5 లక్షలు, రూ.10 లక్షలు ఇస్తామని ఆఫర్ చేస్తున్నారు. నేను నా జీవితంలో విలువలు, విశ్వసనీయతతో కూడిన రాజకీయమే చేశాను.



కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చినప్పుడు వెనక్కి తిరిగి చూస్తే నేను, అమ్మ తప్ప ఎవరూ లేరు. మా ఇద్దరమే బయటకు వచ్చాం. నేను నా జీవితంలో అలాంటి రాజకీయాలే చేశాను. విలువలు విశ్వసనీయతతో కూడిన రాజకీయాలు మాత్రమే చేశాను. నేను అమ్మ ఇద్దరమే కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చాం. నాతో పాటు కొంతమంది ఎమ్మెల్యేలు వస్తామని అడిగితే.. నాతో పాటు రావాలంటే రాజీనామా చేసి రావాలని చెప్పాను. అక్కడ నుంచి మొదలుపెడితే కేవలం ఇద్దరమే మొదలుపెట్టి దేవుని దయతో ప్రతి అడుగులో విలువలు, విశ్వసనీయతతో కూడిన రాజకీయమే చేశామని తలెత్తుకుని గర్వంగా చెప్పుకోగలం.

**10 శాతం ప్రజలు బాబు మాటలు నమ్మారు..**

మొన్న ఎన్నికల్లో ఓ 10 శాతం ప్రజలు చంద్రబాబునాయుడు మాటలు నమ్మారు. చంద్రబాబు నాయుడు, ఆయన ఎమ్మెల్యేలు ఇంటింటికి వెళ్లి నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు సంతోషమా? అని ప్రచారం చేశారు. అలాగే వాళ్ల అమ్మ కనిపిస్తే నీకు రూ.18 వేలు సంతోషమా? అని అడుగుతూ ప్రచారం చేశారు. అదే ఇంట్లో వద్దులు ఉంటే.. నీకు నెలకు రూ.4 వేలు పెన్షన్ సంతోషమా?. అని ప్రచారం చేశారు. ఈ మోసపు ప్రచారంతో ఓ పది శాతం ప్రజలు మన దగ్గర నుంచి దూరమయ్యారు.

**వారందరూ ఏమయ్యారో తెలుసా...**

గతంలో మన పార్టీ నుంచి 23 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలను తీసుకున్నాడు. ఆ 23 మంది ఎమ్మెల్యేల్లో కేవలం ముగ్గురికి టిక్కెట్టిచ్చాడు. వాళ్లకు ఒక్కొక్కరికి రూ.20 కోట్లు ఇస్తామని.. కేవలం అడ్వాన్స్ ఇచ్చాడు. దాంతో అటువైపు పోయిన వాళ్లందరూ మరలా వెనక్కి వచ్చేస్తామని నాకు ఫోన్ చేశారు. కానీ ఒక్కసారి జారిపోయిన తర్వాత వెనక్కి వస్తే విలువలు, గౌరవం పోతుంది. వెనక్కి తీసుకోలేకపోయాం. వాళ్ల రాజకీయ జీవితం సున్నా అయిపోయింది.

# త్వరలో జన్మభూమి2

-మొదటిపేజీ తరువాయి

పేదరిక నిర్మూలనపై విధివిధానాలు రూపొందిస్తాం. విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నవారిని పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగస్వాములుగా చేయాలని నిర్ణయం తీసుకున్నాం. ఎస్సీ వర్గీకరణకు జిల్లాను యూనిట్‌గా తీసుకుంటాం. జన్మభుమి కార్యక్రమాలు తిరిగి ప్రారంభించాలని చంద్రబాబు నిర్ణయించారు. జన్మభూమి2 గా ఈ కార్యక్రమానికి నామకరణం చేయాలని భావించారు. మొన్నటి ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో సరిగ్గా దృష్టి పెడితే వైసీపీ గెలిచిన సీట్లలో మరో నాలుగు నుంచి ఐదు సీట్లు టీడీపీ గెలిచేది" అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

**డీలిమిటేషన్‌లో అన్యాయం: సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**

పొలిట్ బ్యూరోలో ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 55 రోజుల పాలనపై అధినేత చంద్రబాబు చర్చించారని టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



పేర్కొన్నారు. "త్వరలో జన్మభూమి2 ప్రారంభం కాబోతుంది. జన్మభూమి -2 కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి. వర్షాలతో ప్రాజెక్టులన్ని నిండుకుండలా ఉన్నాయి. ప్రాజెక్టులు నిండటంతో మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి గుండె నీరు కారుతోంది. నామినేటెడ్ పోస్టులను అతి త్వరలో భర్తీ చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇసుకలో అక్రమాలు సహించబోనని అధినేత మరోసారి హెచ్చరించారు జనాభా నియంత్రణతో డీలిమిటేషన్‌లో దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతోంది. ఒక యూపీలో 140 పార్లమెంటు స్థానాలు వస్తే దక్షిణ భారతదేశంలో160 మాత్రమే ఉంటాయి. జనాభా తగ్గడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు కూడా తగ్గిపోతాయి" అని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వెల్లడించారు.

**విశాఖ ఎమ్మెల్సీ అభ్యర్థిపై చర్చ..!!**

విశాఖ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎవరనే దానిపై మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలతో చంద్రబాబు మాట్లాడారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ తొలి పొలిట్ బ్యూరో సమావేశం ఇది. ఈ భేటీకి మంత్రులు నారా లోకేష్, కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు, పార్టీ సీనియర్ నేతలు వర్ల రామయ్య, యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, బొండా ఉమామహేశ్వర రావు, పల్లా శ్రీనివాసరావు, కళా వెంకట్రావు తదితరులు హాజరయ్యారు. ఈ భేటీలో చంద్రబాబు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

# పెండింగ్ నిధులు విడుదల చేయాలి

**అమరావతి:** ఢిల్లీలో ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీని ఆంధ్రప్రదేశ్ మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం నాడు కలిశారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకుని వినతి పత్రం అందజేశారు. రాష్ట్రానికి కందిపప్పు కేటాయింపులు చేయాలని నాదెండ్ల మనోహర్ కోరారు.

**పెండింగ్ నిధులపై..**

ఏపీలో ప్రస్తుతం ఉన్న ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ కవరేజీ కాకుండా లబ్ధిదారుల కవరేజీని మరింత పెంచాలని అడిగారు. రాష్ట్రంలో మరో 8 ప్రైస్ రిపోర్టింగ్ కేంద్రాలను పెంచేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ధరల స్థిరీకరణకు రూ.532 కోట్ల ఇందుకు సంబంధించిన నిధులను కేటాయించాలని కోరారు. రాష్ట్రానికి రావాల్సిన రూ.1187 కోట్ల పెండింగ్ నిధులను వీలైనంత త్వరగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 11 సీ గోడౌన్ల నిర్మాణానికి అనుమతి మంజూరు చేయాలన్నారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి ఈ అంశాలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని నాదెండ్ల మనోహర్ తెలిపారు.

**దీపం కనెక్షన్ల గురించి..**

ఢిల్లీలో కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ ఎస్ పూరిని మంత్రి నాదెండ్ల మనోహర్ కలిశారు. ఏపీలో ప్రస్తుతం ఉన్న 60 లక్షల దీపం కనెక్షన్లను పీఎమ్‌యూవై పథకం కింద వచ్చే విధంగా మార్పిడి చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబు రాసిన లేఖను కేంద్రమంత్రికి అందజేశారు. ఈ అంశాన్ని పరిశీలించి, చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

ఏపీకి విభజన వల్ల నష్టం..

దేశవ్యాప్తంగా కందిపప్పు కొరత ఎక్కువగా ఉందని మంత్రి



నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఏపీలో కిలో కందిపప్పు రూ.150లకు అందిస్తున్నామని అన్నారు. లక్ష మెట్రిక్ టన్నుల కందిపప్పు కేటాయించాలని.. కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని కోరామని తెలిపారు. ధాన్యం నిల్వ, గిడ్డంగుల నిర్మాణం కోసం కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో సింహభాగం ఇవ్వాలని కోరామని చెప్పారు. 1.47 లక్షల రేషన్ కార్డులకు రేషన్ అందిస్తున్నామని వివరించారు. కేంద్ర రాష్ట్ర మార్కెటింగ్ శాఖలు నిర్వహించే ప్రైస్ మానిటరింగ్ సెంటర్లను ప్రస్తుతం ఉన్న 5 నుంచి 13కు పెంచాలని కోరామన్నారు. అలాగే కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీని కలిశానని చెప్పారు. ఉజ్వల స్కిమ్‌లో ఏపీకి నష్టం జరుగుతుందని కేంద్రమంత్రికి తెలిపానని అన్నారు. ఏపీకి విభజన వల్ల నష్టం జరిగిందని.. న్యాయం చేయాలన్న భావన కేంద్ర పెద్దల్లో కనిపిస్తుందని అన్నారు. కేంద్రమంత్రులను కలిసి రాష్ట్ర సమస్యలు తెలిపేందుకు ఎంపీలు, అధికారులు వారి సహకారాన్ని అందించారని వివరించారు. రాష్ట్ర అంశాల పరిష్కారానికి కేంద్రం సుముఖంగా ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.

**కందిపప్పు కొరతపై..**

కందిపప్పు ఇతర దేశాల నుంచి కేంద్రం దిగుమతి చేసుకుంటుందని అన్నారు. నవంబర్ నాటికి కందిపప్పు సమస్య పరిష్కరిస్తామని కేంద్రమంత్రి తెలిపారన్నారు. కందిపప్పు సమస్య తాత్కాలికంగా వచ్చిందని.. రైతులు పంట పండిస్తే ధాన్యం కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో త్వరలో కొత్త రేషన్ కార్డుల జారీ చేస్తామని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు అన్యాయం జరిగిందన్నారు. రైతుల నుంచి పంట సేకరించి డబ్బు ఇవ్వలేదని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

**డోర్ డెలివరీ రేషన్‌పై చర్చిస్తాం..**

పెండింగ్‌లో ఉన్న రూ. 1674 కోట్లను రైతులకు చెల్లిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రూ.1000 కోట్లు ఇచ్చామన్నారు. సోమవారం మరో రూ. 674 కోట్లను చెల్లించబోతున్నామని వెల్లడించారు. డోర్ డెలివరీ రేషన్ అంటూ రూ.1800 కోట్లు జగన్ ప్రభుత్వం వృథా చేసిందని ధ్వజమెత్తారు. డోర్ డెలివరీ రేషన్‌పై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. అర్హత ఉన్నవారికి రేషన్ కార్డులు ఇస్తాం.. టార్గెట్ అంటూ ఏమి లేదని స్పష్టం చేశారు. రేషన్ బియ్యాన్ని గ్రీన్ ఛానల్ ద్వారా అక్రమ తరలింపు చేశారని మంత్రి నాదెండ్ల మనోహర్ మండిపడ్డారు.

**వైసీపీపై మంత్రి నాదెండ్ల ధ్వజం..**

రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన ఎందుకు పెట్టాలని మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రశ్నించారు. ఇంటింటికీ రూ.4 వేల పెన్షన్ ఇచ్చినందుకా..? పోలవరం పనులు మొదలు పెడుతున్నందుకా..? కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రత్యేక సహకారం తీసుకువచ్చినందుకా..? అని నిలదీశారు. జగన్ కోటల్లో ఉంటారు..ప్రజలు ఎలా ఉంటున్నారో తెలుసా ..? అని అడిగారు. జగన్ ప్రజల పక్షాన నిలబడాలి..ఆయన పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. శాంతి భద్రతలు లేవని రాష్ట్రపతి పాలన పెట్టాలని అనడం సరికాదని అన్నారు. వైసీపీకి ఎలక్షన్ కమిషన్‌లో సభ్యత్వం లేని పార్టీ అని విమర్శించారు. ముందు జగన్ పార్టీని చక్కదిద్దుకోవాలని సూచించారు. వైసీపీ పార్టీ ఎవరిదో క్లారిటీ లేదని ఎద్దేవా చేశారు. ఏపీలో సూపర్ సిక్స్ ఖచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. తాడు బొంగరం లేని పార్టీ వైసీపీ అని మంత్రి నాదెండ్ల మనోహర్ విమర్శించారు.

## హీరోలు స్మగ్లింగ్ చేసే పాత్రలు చేస్తున్నారు



కర్ణాటక వెళ్లిన ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తాజాగా సినిమాల్లో హీరోలు చేస్తున్న పాత్రలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 40 ఏళ్ల క్రితం హీరో అనేవాడు అడవులను కాపాడే వాడని, కానీ ఇప్పుడు ఆ అడవుల్లోని చెట్లను నరికి స్మగ్లింగ్ చేస్తున్నాడని వ్యాఖ్యానించారు. మారిన కల్చర్ ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. సినిమా రంగానికి చెందిన వాడిగా ఇలాంటి చిత్రాల్లో నటించడానికి తాను చాలా ఇబ్బంది పడతానని పవన్ తెలిపారు. కాగా, గురువారం కర్ణాటక వెళ్లిన పవన్ ... ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్యతో భేటీ అయిన విషయం తెలిసిందే. వన్యప్రాణి, అటవీ సంరక్షణ అంశాలపై ఆయనతో పవన్ చర్చించారు. ప్రధానంగా ఎర్రచందనం అక్రమ రవాణా నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు సమాచారం. అలాగే ఏనుగుల గుంపు రైతుల పొలాలను ధ్వంసం చేస్తున్న అంశం వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కర్ణాటక నుంచి 6 కుంకీ ఏనుగులను ఏపీకి ఇవ్వాలని పవన్ కల్యాణ్ కోరారు.

## రైతులకు విత్తనాల కొరత లేకుండా చూడాలి

-మొదటిపేజీ తరువాయి

పార్కు ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. కాగా ఈ సమీక్షలో వ్యవసాయ యాంత్రీకరణ, గ్రామ సచివాలయ ఉద్యోగులు మాతృ సంస్థలకు అనుసంధానం చేయడం వంటి పలు కీలక అంశాలపై చర్చించారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడితో పాటు అధికారులు పాల్గొన్నారు.

**కాంస్యం సాధించిన హాకీ జట్టుకి అభినందనలు: మంత్రి అనగాని**

పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత హాకీ జట్టును మంత్రి అనగాని సత్యప్రసాద్ అభినందనలు తెలిపారు. 52 ఏళ్ల తర్వాత వరుసగా రెండు ఒలింపిక్స్‌లలో కాంస్య పతకం సాధించడం దేశానికి గర్వకారణమని వ్యాఖ్యానించారు. ఈ పతకం భారత జాతీయ క్రీడ అయిన హాకీకి పునర్వైభవం తీసుకొస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కెప్టెన్ హర్మన్ ప్రీత్, కీపర్ శ్రీజేష్ పతక సాధనలో కీలక పాత్ర పోషించారని మంత్రి అభినందించారు. హాకీ జట్టు ఇచ్చిన స్ఫూర్తితో భారత క్రీడాకారులు మరిన్ని పతకాలు గెలవాలని ఆశిస్తున్నట్టు ఆయన చెప్పారు.

## జగన్‌ను ఆ పార్టీ నేతలే భరించలేకపోతున్నారు..

**అమరావతి :** జగన్‌ను ప్రజలు మాత్రమే కాదు..ఆయన పార్టీ నేతలూ భరించలేకపోతున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డి విలువలు, విశ్వసనీయత గురించి మాట్లాడుతుంటే నవ్వొస్తోందన్నారు. ఇచ్చిన హామీల్లో కేవలం 13 శాతం మాత్రమే అమలు చేసి ప్రజలకు



పంగనామాలు పెట్టిన జగన్‌కు హామీల అమలులో చంద్రబాబును విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. జగన్‌ను రాష్ట్ర ప్రజలు మాత్రమే కాదు.. ఆయన పార్టీ నేతలు కూడా వద్దనుకుంటున్నారన్నారు. పోలోమని పెద్ద సంఖ్యలో వైసీపీ నేతలు రాజీనామాలు చేసి ఇతర పార్టీల్లో చేరుతున్నారని తెలిపారు. ఈ కారణంగానే విశాఖ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్లోనే కాదు.. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ వైసీపీకి ఓటమి ఖాయమని స్పష్టం చేశారు. వరుసగా అన్ని ఎన్నికల్లో ఓడిపోతున్నా జగన్‌కు తత్వం బోధపడడం లేదని, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోవడం లేదన్నారు. జగన్ రెడ్డి తాను మళ్లీ సీఎం కుర్చీపైన కూర్చుంటానంటూ పగటి కలలు కంటున్నారన్నారు. జగన్ మానసిక స్థితి బాగోలేదని ఆయన చెల్లెలు చెప్పింది నిజమే అన్నట్లుగా ఆయన వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలలకే అన్ని వ్యవస్థలూ విఫలమయ్యాయని జగన్ పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారని మండిపడ్డారు. వైసీపీ పాలన చేసిన గాయాల నుంచి ప్రజల ఇంకా కోలుకోలేదన్నారు. 11 సీట్ల మాత్రమే ఇచ్చి ఆ పార్టీని అధ:పాతాళానికి తొక్కిన ప్రజలు... నిజంగా జగన్ ప్రజలకు బిర్యానీనే పెట్టి ఉంటే ఎన్నికల్లో ప్రజలెందుకు దారుణంగా ఓడించారని మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రశ్నించారు.

## ఆటవిక రాజ్యం కొనసాగుతోంది

-మొదటిపేజీ తరువాయి

కార్యకర్తని కిడ్నాప్ చేశారన్నారు. మాచర్ల నియోజకవర్గానికి చెందిన నాగరాజు ప్రాణభయంతో వినుకొండ వచ్చారని తెలిపారు. పోలీసు వ్యవస్థ పని చేస్తోందా? అని ప్రశ్నించారు. ఎస్పీతో కూడా మాట్లాడామని అన్నారు. నాగరాజుకు ఏ విధమైన హాని జరిగినా ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యత వహించాలన్నారు.

బెయిల్ మీద బయట వచ్చి కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నారని.. అలాంటి వ్యక్తిని కిడ్నాప్ చేశారని అన్నారు. నాగరాజు కుటుంబ సభ్యులను కొట్టి టీడీపీ గూండాలు కిడ్నాప్‌కు దిగారని మండిపడ్డారు. నడిరోడ్డు మీద హత్యలు, కిడ్నాప్‌లు జరుగుతున్నాయన్నారు. అసలు రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నట్టా? లేనట్టా? అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని మణిపూర్, బీహార్‌లాగ మార్చారని విమర్శలు గుప్పించారు.

టీడీపీ నేతలు ఏం చేసినా పోలీసులు వారిని ఏమీ అనటానికి వీల్లేదని హోంమంత్రి నుంచే ఆదేశాలు వెళ్లాయన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని విరుచుకుపడ్డారు. ఆటవిక రాజ్యం కొనసాగుతోందన్నారు. పోలీసులు వెంటనే స్పందించి నాగరాజును కాపాడాలని మాజీ మంత్రి అంబటి రాంబాబు డిమాండ్ చేశారు.

## అంబటి రాంబాబు చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారం: ఏపీ పోలీస్ శాఖ

**నారా దేవాన్ష్ కు ఆరుగురితో సెక్యూరిటీ ఇచ్చారన్న అంబటి రాంబాబు**

**అంబటి రాంబాబు వ్యాఖ్యలు వాస్తవదూరంగా ఉన్నాయన్న పోలీస్ శాఖ**

**దేవాన్ష్ కు ఎలాంటి రాష్ట్ర సెక్యూరిటీ లేదని స్పష్టీకరణ**

ప్రాణహాని ఉన్న జగన్ కు భద్రత తగ్గించారని, ముఖ్యమంత్రి చంద్రబాబు మనవడు నారా దేవాన్ష్ కు ఆరుగురితో సెక్యూరిటీ ఏర్పాటు చేశారని వైసీపీ నేత అంబటి రాంబాబు వ్యాఖ్యానించడం తెలిసిందే. దీనిపై ఏపీ పోలీస్ శాఖ స్పందించింది. మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారం అని స్పష్టం చేసింది. ఆయన చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు చాలా దూరంగా ఉన్నాయని పేర్కొంది. ఏపీ స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ చట్టం-2023 ప్రకారం ముఖ్యమంత్రితో పాటు, ఆయన కుటుంబ సభ్యులకు కూడా భద్రత కల్పించాలని చెబుతోందని ఏపీ పోలీస్ శాఖ వివరించింది. ఎస్ఎస్ జీ-2023 చట్టం ప్రకారం ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు కూడా ఎస్ఎస్ జీ భద్రతకు అర్హులైనప్పటికీ, వారు ఎస్ఎస్ జీ నుంచి కానీ, ఐఎస్ డబ్ల్యూ నుంచి కానీ ఎలాంటి భద్రతను వినియోగించుకోవడంలేదని స్పష్టం చేసింది. నారా దేవాన్ష్ విషయంలోనూ ఇదే జరుగుతోందని, దేవాన్ష్ రాష్ట్ర భద్రతను వినియోగించుకోవడంలేదని ఏపీ పోలీస్ శాఖ తేల్చి చెప్పింది.

# నాడు చంద్రబాబును జగన్ హేళన చేశారు... ఇప్పుడు జగన్ పరిస్థితి ఏంటి?

**ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కూటమిదే విజయమన్న గంటా శ్రీనివాసరావు**

**విశాఖ భూ కుంభకోణాలన్నీ వెలికి తీస్తామని వెల్లడి**

**దోషులకు శిక్ష తప్పదని వ్యాఖ్యలు**

**జగన్ ఇప్పుడు పులివెందుల ఎమ్మెల్యే మాత్రమేనని స్పష్టీకరణ**

విశాఖపట్నంకు త్వరలోనే మెట్రో రైల్ వ్యవస్థ, ఫ్లై ఓవర్లు రానున్నాయని టీడీపీ ఎమ్మెల్యే మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. విశాఖ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కూటమిదే విజయం అని ధీమా వ్యక్తం చేశారు. విశాఖలో భూ కుంభకోణాలపై సమగ్ర దర్యాప్తు చేస్తామని వెల్లడించారు. వైజాగ్ ఫైల్స్ పై త్వరలోనే పూర్తి నివేదిక వస్తుందని, విశాఖ భూ కుంభకోణాలను బయటపెడతామని అన్నారు. అక్రమార్కులను వదిలే ప్రసక్తే లేదని అన్నారు. దోషులకు శిక్ష తప్పదని పేర్కొన్నారు. రుషికొండ భవనాలపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని గంటా తెలిపారు. "నిన్నటి విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమి సభ్యుల విజయం రాబోయే అన్ని ఎన్నికల్లో మా విజయానికి నాంది. విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిని త్వరలోనే ప్రకటిస్తాం. గతంలో విపక్ష నేతగా ఉన్న చంద్రబాబును జగన్ అవహేళన చేశారు. 23 మంది ఎమ్మెల్యేల్లో సగం మందిని లాగేసుకుంటే చంద్రబాబుకు ప్రతిపక్ష నేత పోదా అని జగన్ వ్యాఖ్యానించలేదా? ఇప్పుడు జగన్ పరిస్థితి ఏంటి? జగన్ ఇప్పుడు పులివెందుల ఎమ్మెల్యే మాత్రమే... విపక్ష నేత కాదు. వైసీపీకి ప్రజలు 11 స్థానాలు ఇచ్చారు... అయినప్పటికీ వైసీపీకి మేం గౌరవం ఇస్తున్నాం. మేం గనుక గేట్లు తెరిచామంటే వైసీపీ ఖాళీ అవడం ఖాయం" అని గంటా వ్యాఖ్యానించారు.



షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# నేడు మంత్రి స్వామి సింగరాయకొండ రాక



## సోమరాజుపల్లి, గోపాల్ నగర్ గ్రామంలో మంత్రి పర్యటన


(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, ఆగస్టు 8)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి శుక్రవారం ఉదయం 8 గంటలకు సింగరాయకొండ మండలం సోమరాజుపల్లి గ్రామ పంచాయతీలో పర్యటించనున్నట్లు మండల పార్టీ నాయకులు వేల్పుల సింగయ్య యాదవ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆ గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం సింగరాయకొండ మండలం గోపాల్ నగర్ గ్రామంలో 8.30 గంటలకు పర్యటించనున్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

# సింగారావు కథ కంచికేనా!



## నకిలీ మ్యుటేషన్ పత్రాల కేసును తొక్కిపెట్టిన ఒంగోలు రెవెన్యూ డివిజనల్ కార్యాలయం పోలీస్ విచారణ సాగతీతేనా...?



Date: 08-08-2024

To,
The Revenue Divisional Officer,
Ongole Division,
Prakasam District,
Andhra Pradesh.

Subject: Reminder for Response to SHO Kondapi Police Station's Letter Dated 20 January 2024, Regarding Investigation into Fabricated Mutation Proceedings.

Respected Sir/Madam,

I, Palavalli Sanjeeva Reddy, S/o Mr. Palavalli Punna Reddy, residing at K. Uppalapadu Village, Kondepi Mandal, Prakasam District, am writing to bring to your kind attention a matter that requires urgent intervention.

On 06 January 2024, I lodged a complaint with the Station House Officer (SHO), Kondapi Police Station, regarding the fabrication of documents in the agricultural land mutation proceedings at Kondapi MRO Office. The fabricated documents pertain to Application No. MUT230630324340 and have caused unnecessary disputes concerning the land in Sy.No. 342/1 of K. Uppalapadu Village, which is lawfully owned and possessed by my father, Mr. Palavalli Punna Reddy.

As part of the preliminary inquiry, the SHO of Kondapi Police Station addressed a letter to your esteemed office on 20 January 2024, seeking clarification and information necessary to proceed with the investigation. However, despite the

(షణ్ముఖ వెలుగు, కొండపి, ఆగస్టు 8)

భూముల ఆన్లైన్‌లో అన్ని హక్కు పత్రాలు లేకుండానే నకిలీ అధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆన్లైన్ చేసిన తహశీల్దారు సింగారావు కథ కంచికేనా! భు హక్కు గల వారికి న్యాయం అందని ద్రాక్షేనా! అని ఉప్పలపాడు గ్రామానికి చెందిన భూయజమాని న్యాయవాది పాలవల్లి సంజీవరెడ్డి మండిపడ్డారు. నకిలీ అధికారి పేరుతో ఇచ్చిన నివేదికతో న్యాయవాదికి చెందిన భూమిని అప్పటి తహశీల్దార్ సింగారావు మరొకరికి ఆన్లైన్ చేశారు. దానిని పసిగట్టిన న్యాయవాది కొండపి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో అప్పట్లో ఆ విషయం సంచలనం సృష్టించింది. నకిలీ పత్రాలను పరిశీలించి నకిలీ అధికారిని గుర్తించి తెలియజేయమని అప్పటి కొండపి పోలీస్ అధికారి విచారణలో భాగంగా ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారిని లిఖిత పూర్వకంగా అడిగారు. అయినా డివిజనల్ కార్యాలయ అధికారులు దానిని అప్పటి కొందరు అధికారపార్టీ నేతల ఒత్తిడితో తొక్కిపెట్టి, దానిపై చర్యలు లేకుండా మసిపూసి మారేడు కాయ చందంగా చేశారు. నూతన ప్రభుత్వంలో తనకి న్యాయం జరుగుతుందని ఆశతో ఉన్న న్యాయవాదికి తీవ్రమై నిరాశ ఎదురైంది. అయినప్పటికీ పట్టువదలని న్యాయవాది గురువారం పోలీ వారికి సహకరించి తప్పుడు పత్రాలతో మ్యుటేషన్ చేసిన అధికారులను కాపడకుండా, పోలీస్ వారి విచారణకు సహకరిం చమని కోరుతూ ఒంగోలు ఆర్డీఓకి వినతి పత్రం అందించారు. పూర్తి విచారణ చేసి, కొండపి పోలీస్ అధికారికి మ్యుటేషన్‌లోని లోపాలను గుర్తించి, నకిలీ పత్రాలను గుర్తించి తగిన రిపోర్ట్ అందజేయాలని ఫిర్యాదులో కోరారు. ఇకనైనా ఇలాంటివి పునరావృత్తం కాకుండా జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, తద్వారా భూ యజనులకు న్యాయం జరుగుతుందని న్యాయవాది సంజీవరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మరి ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు న్యాయం చేస్తారో లేదో వేచి చూడాల్సిందే...!

# రాజీవ్ గృహకల్ప కాలనీలో వంద రోజుల్లో సదుపాయాలు కల్పిస్తాం

## మంత్రి నారాయణ

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఆగస్ట్ 8)



ఒంగోలు నగరంలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో వంద రోజుల్లోనే మౌలిక సదుపాయాలను కల్పిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ హామీ ఇచ్చారు. గురువారం ఒంగోలు వచ్చిన ఆయన కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావుతో కలిసి ఈ కాలనీని సందర్శించారు. తమకు సిమెంటు రోడ్లు, డ్రైనేజీ సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఈ కాలనీలో మంత్రి కలియతిరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా రాష్ట్ర ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. వంద రోజుల్లోనే ఈ కాలనీలో మురుగు కాలువలు, సిమెంటు రోడ్లు నిర్మిస్తామని ప్రకటించారు. వీటికోసం రూ.2.38 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు ఇప్పటికే అంచనాలు రూపొందించినందున ఈ మేరకు నిధులు విడుదల చేస్తామని, త్వరలోనే టెండర్లు పిలుస్తామని మంత్రి చెప్పారు. గత ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించలేని ఆయన వ్యాఖ్యానించారు. ఫలితంగా ప్రజలు ఇంటిపన్ను, వీటి పన్నుల రూపంలో చెల్లించిన డబ్బులు రూ.1900 కోట్లు కేవలం మున్సిపల్ శాఖకే రావాల్సి







ఉన్నప్పటికి లెక్కా పత్రం లేకుండా వాడేశారని అన్నారు. అదేవిధంగా గత మార్చి నుంచి సెప్టెంబరు వరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.454 కోట్లను ఖర్చు చేస్తే సెప్టెంబరు నుంచి మార్చి వరకు మరో రూ.454 కోట్లు వచ్చేవని, కానీ గత ప్రభుత్వం ఆ విధంగా ఖర్చు చేయకపోవడం వలన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు సుమారు వెయ్యి కోట్ల రూపాయలు నష్టపోయిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ముందుగా ఈ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించిన తరువాత జర్నలిస్ట్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలలో కూడా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి చెప్పారు. (తరువాయి 4లో...)

# ప్రపంచంతో పోటీ పడాలంటే క్రీడలతోనే సాధ్యం

## ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 8)

ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో 77వ స్వతంత్ర దినోత్సవ ఛాంపియన్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌ని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు రాయపాటి జగదీష్‌లు జాతీయ జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ ప్రపంచంతో పోటీ పడాలంటే క్రీడలతోనే సాధ్యమని ఈరోజు ఒలంపిక్స్‌లో ప్రపంచ దేశాలు పోటీ పడుతున్నాయని, భారతదేశం కూడా ప్రపంచంతో పోటీపడే విధంగా క్రీడాకారులను తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. జగదీష్ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ 77వ స్వతంత్ర దినోత్సవం పురస్కరిం చుకొని భారత దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చంద్రబాబు నాయుడు స్వాతంత్ర దినోత్సవ ఉత్సవాలు జరుపుకున్న భాగంగా గురువారం ఒంగోలులో శర్మ కాలేజీ గ్రౌండ్లో క్రికెట్ టోర్నమెంట్‌తో పాటు ప్రారంభించారని, విద్యార్థి యువత కేరింతలతో జై భారత్ జై జనార్ధన జై జేఏసీ జై జగదీష్ అంటూ నినాదాలు ఇచ్చారు. అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులు కరుణాకర్ నగర అధ్యక్షులు శ్రీకృష్ణ సూర్యప్రకాష్, సాయి సురేంద్ర, స్టీఫెన్, లోకేష్, రాము, అభయ్, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# విఘత జీవులుగా రోడ్డుపై రెండు జింకలు

## మానవత్వం చాటుకున్న పొదిలి సీఐ మల్లికార్జున్ రావు, ఎస్ఐ జి కోటయ్య

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 8)

సాటి మనుషుల పట్ల ప్రేమ జాలి, కరుణ, దయ చూపని దుర్మార్గ సమాజంలో నోరులేని మూగజీవాల పై జాలి చూపించారు సీఐ, ఎస్ఐలు. విధి నిర్వహణలో భాగంగా ఒంగోలు నుంచి పొదిలి వస్తున్న క్రమంలో మార్గమధ్యంలోని ఉప్పలపాడు సమీపంలో విఘత జీవులుగా మారిన రెండు జింకలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు పొదిలి సీఐ మల్లికార్జున్‌రావు, ఎస్ఐ జి కోటయ్య. గుర్తుతెలియని వాహనం ఢీకొని అప్పటికే మృత్యువాత పడ్డాయి రెండు జింకలు. రోడ్డు పై వచ్చే వాహనాలు జింకలను తొక్కిస్తుండంతో ప్రత్యక్షంగా చూసి తట్టుకోలేకపోయారు వారిద్దరూ. దీంతో వారు ప్రయాణించే వాహనాన్ని ఆపి జాలితో జింకలను రోడ్డు పక్కకు తొలగించి మానవత్వం చాటుకున్నారు పోలీస్ అధికారులు. సీఐ మల్లికార్జున వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న ఫారెస్ట్ అధికారులు విగత జీవులైన జింకలను తీసుకువెళ్లారు. మూగ జీవాల పై కరుణ చూపించిన సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ కోటయ్యలను మండల ప్రజలు అభినందించారు.





# రాజీవ్ గృహకల్ప కాలనీలో వంద రోజుల్లో సదుపాయాలు కల్పిస్తాం



ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండురోజుల్లోనే టెండర్లు పిలిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. ఒంగోలు నగరంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని చెప్పారు. మౌలిక సదుపాయాల కోసం నిధుల మంజూరుకు అనుమతించిన మంత్రి నారాయణకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటనలో మంత్రి వెంట డి.ఆర్.ఓ. విశ్వేశ్వరరావు, హౌసింగ్ పి.డి. పేరయ్య, ఒంగోలు నగర పాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత, మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.



# ఘనంగా ఉజ్వల్‌రెడ్డి జన్మదిన వేడుకలు

## విద్యార్థులకు స్వీట్లు పంపిణీ



**(షణ్ముఖ వెలుగు, తిరుపతి, ఆగస్ట్ 8)**

తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం బత్తలవల్లం పంచాయతీలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక వైకాపా సీనియర్ నేత ఓడూరు ఉజ్వల రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఓడూరు ఉజ్వలరెడ్డి పాఠశాలకు చేరుకుని విద్యార్థులను కలుసుకున్నారు. తన జన్మదిన వేడుక సందర్భంగా ఆయన విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని చదువుల విషయంలో రాజీలేని పోరాటంతో ఉన్నత చదువులను అభ్యసించి భవిష్యత్తులో మీ కుటుంబానికి అండగాను, సమాజానికి సేవకులు గాను ఉండే విధంగా భవిష్యత్తు కార్యాచరణను తీర్చిదిద్దుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పాఠశాల కమిటీ కి ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామస్థాయిలో పాఠశాలలు అభివృద్ధి పథంలో నడిపేందుకు పాఠశాల కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతోందని ఉజ్వల రెడ్డి అన్నారు. పాఠశాల కమిటీ ఎన్నికలలో నూతన ప్రాథమిక పాఠశాల చైర్మన్ గా ఎన్నికైన పోలయ్యకు, అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ గా ఎన్నికైన శ్యాం బాబు , శిరీష లకు, అలాగే రాచకండ్రిగ ప్రాథమిక పాఠశాల చైర్మెన్‌గా ఎన్నికైన హరీష్ కు ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల అభివృద్ధి కోసం సేవా దృక్పదంతో ముందుకు సాగాలని కోరారు.

# ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు అవగాహన



**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 8)**

గిద్దలూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ప్రదేశాల గుర్తింపు చర్యల్లో భాగంగా గిద్దలూరులో ఆర్టీవో అమర్ నాయక్, ఎంవీఐ మాధవరావు, గిద్దలూరు ఇంచార్జి మున్సిపల్ కమీషనర్ ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో ఉన్న ఆటో డ్రైవర్లతో అతివేగం, రోడ్స్ పై పార్కింగ్, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా ఆటోలను నిలుప వద్దని అవేర్నెస్ కలిగించారు. పట్టణంలో ట్రాఫిక్‌కి అంతరాయం కలిగించే ప్రాంతాల గుర్తింపు చర్యల్లో భాగంగా ఆర్టీవో మార్కాపురం, వారి సిబ్బంది తనిఖీలు చేపట్టారు.

# ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కాలేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు

## విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఆగస్టు 8)**

ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, అధ్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులతో సందర్శించారు. వారితో సమావేశమై సమస్యల గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో 250 మందికి పైగా విద్యార్థులు కలరని, ఒకేషనల్ స్టూడెంట్స్‌కు కంప్యూటర్ ల్యాబ్‌లో 10 కంప్యూటర్స్, స్టూడెంట్స్ భోజనం చేయడానికి డైనింగ్ హాల్, విద్యార్థి, విద్యార్థులకు డ్యూయెల్ డెస్కులు మంజూరు, క్యాంపస్‌లో పిల్లలు గేమ్స్ ఆడుకోవడానికి అడ్డంకిగా ఉన్న మట్టి, పాత బిల్డింగ్ గోడలను తొలగించుటకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. మంత్రి మాట్లాడుతూ కళాశాల సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి విధానాలతో, విద్యా వ్యవస్థ సర్వ నాశనమైందని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారధ్యంలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు రానుందని గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.





# కళత్తూరులో విషాదం కూలీ దుర్మరణం

## పొట్టకూటికోసం కూలీ పనులకు వెళ్లి కానరాని లోకానికి



**(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, ఆగస్టు 8)** బాకరాపేట ఘాట్ వద్ద ధాన్యం లారీ బోల్తా ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. కూలీని వరదయ్యపాలెం మండలం కళత్తూరు గ్రామానికి చెందిన చెందిన నవీన్ యాదవ్ (28) అక్కడికక్కడే మృతి చెందాడు. కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న నవీన్ భార్య ఇపుడు ఎనిమిది నెలల గర్భిణి, కాగా రెండేళ్ల కుమార్తె కూడా ఉంది . కుటుంబ యజమాని మృతి చెందడంతో ఆ కుటుంబం వీధిన పడింది. గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగింది. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు వేడుకుంటున్నారు.

# వక్ఫ్ చట్టం సవరణ బిల్లు రాజ్యాంగ ధిక్కార చర్య

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సైదా



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 8)**

ఎన్డీఏ ప్రభుత్వం పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లును ప్రవేశపెట్టడంపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సైదా వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్లో వక్ఫ్ చట్టం సవరణ బిల్లును ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశ పెట్టడం రాజ్యాంగ ధిక్కార చర్యగా అభివర్ణించారు. ఇది మైనార్టీలకు రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛ హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు. మైనార్టీ హక్కులకు భంగం కలిగిస్తే తాటతీస్తాం అన్న చంద్రబాబు, లోకేష్‌లు నోరు విప్పాలన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు పార్లమెంట్లో టిడిపి మద్దతు తెలపడం దుర్మార్గమైన చర్య అన్నారు. మైనార్టీ హక్కులను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వానికి, నల్ల చట్టాలకు తెలుగుదేశం మద్దతు తెలపడం సిగ్గుమాలిన చర్య అన్నారు. ఈ దుశ్చర్యకు నైతిక బాధ్యతగా టిడిపి చెందిన మైనార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, మంత్రులు ,వివిధ స్థాయి నాయకులు వెంటనే రాజీనామా చేయాలన్నారు. మైనార్టీల మీద విషాన్ని చిమ్ముతున్న ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో కొనసాగి నైతికత లేదన్నారు. మైనార్టీల హక్కులు కాపాడుతామని గల్లీ, గల్లీ తిరిగి టిడిపికి ఓట్లు వేయండి అని ప్రచారం చేసిన మైనార్టీ హక్కులనేత రఫీ, ఫరూక్ శుబ్లి ఇతర నేతలు అన్నారు. తమ తమ పదవులకు రాజీనామా చేసి మైనార్టీలకు క్షమాపణ చెప్పాలన్నారు. చేతనైతే! తెలుగుదేశాన్ని, చంద్రబాబుని, లోకేష్‌ని నిలదీయాలన్నారు. వక్ఫ్ చట్టం సవర్ణ బిల్లును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు.

# విద్యా కమిటీ చైర్మన్‌గా కంఠ ఓబులేసు వైస్ చైర్ పర్సన్‌గా షేక్ పర్వీన్



**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 8)**

మండలంలోని ముండ్లపాడు గ్రామంలోని గంజి భద్రయ్య మెమోరియల్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ఏకగ్రీవం అయ్యాయి. విద్యా కమిటీ చైర్మన్‌గా కంఠ ఓబులేసు, వైస్ చైర్ పర్సన్ గా షేక్ పర్వీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కడియం శేషగిరి, బొమ్మినేని వెంకటేశ్వర్లు, సయ్యద్ భాష, మండల కోఆప్షన్ మెంబర్ సయ్యద్ పీరాఖాన్, సయ్యద్ మియా, చిన్నవలి (డుమ్ము), పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

# శ్రీధనమల్లి జెడ్పీ హైస్కూల్లో కమిటీ చైర్మన్ ఎన్నికలు

## చైర్మన్‌గా డమయీ పద్మజ, వైస్ చైర్మన్ డమయీ శ్రీనివాసులు ఎన్నిక



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, ఆగస్టు 8)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన స్కూల్ కమిటీ ఎన్నికలు శ్రీధన మల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్లో గురువారం నిర్వహించారు. స్కూలు ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో స్కూల్ చైర్మన్‌గా కమిటీ చైర్మన్‌గా డమయీ పద్మజ, వైస్ చైర్మన్ డమయీ శ్రీనివాసులు ఎన్నుకోబడ్డారు. స్కూల్ చైర్మన్‌కు, వైస్ చైర్మన్‌కు హైస్కూల్లో ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## రోడ్డు ప్రమాద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం

ఎమ్మెల్యే ఆదిమూలం

హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్న ఎమ్మెల్యే క్షతగాత్రులకు పరామర్శ



(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, ఆగస్టు 8)

భాకరాపేట ఘాట్ వద్ద ధాన్యం లారీ బోల్తా ఘటనలో వరదయ్యపాలెం మండలం కళత్తూరుకు చెందిన నవీన్ (28) బుధవారం సాయంత్రం మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన మరో ఆరు మంది కూలీలు తీవ్ర గాయాలై తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం ఉదయం హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. డిఎంహెచ్ఓ శ్రీహరితో కలిసి ఆసుపత్రిలో గాయపడిన మల్లిఖార్జునయ్య, శేఖర్, మణి భూషణ్, వెంకటేష్, మణి, బాలయ్యలను పరామర్శించారు. ఇందులో మల్లిఖార్జునయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే రుయా వైద్యాధికారులకు సూచించారు. కాగా ప్రమాదంలో మృతి చెందిన నవీన్ మరణం తనను తీవ్రంగా కలిసిందని ఎమ్మెల్యే ఆదిమూలం ఆవేదన వ్యక్తం చేశారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం అన్నీ విధాలుగా ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని భరోసా కల్పించారు.

## కోటపోలూరు జెడ్పీ హైస్కూల్లో కమిటీ చైర్మన్ ఎన్నికలు

చైర్మన్ గా కైలాసం కిషోర్,

వైస్ చైర్మన్‌గా ఈదురు కల్పన ఏకగ్రీవ ఎన్నిక





(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, ఆగస్టు 8)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన స్కూల్ కమిటీ ఎన్నికలు కోటపోలూరు జెడ్పీహెచ్ఎస్ స్కూల్లో గురువారం నిర్వహించారు. స్కూలు ప్రధానోపాధ్యాయులు చంద్రజిత్ యాదవ్ ఆధ్వర్యంలో స్కూల్ చైర్మన్‌గా ఏకీగ్రీవంగా కైలాసం కిషోర్ వైస్ చైర్మన్‌గా ఈదురు అరుణ్ కుమార్ బలపరిచిన ఈదురు కల్పనను ఎన్నుకోవడం జరిగింది. స్కూల్ కమిటీ చైర్మన్గా కైలాసం కిషోర్ వైస్ చైర్మన్ కల్పన కు రూలర్ టిడిపి ఉపాధ్యక్షుడు వాసం రెడ్డి, సుధాకర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట మైనార్టీ మోర్చ ఉపాధ్యక్షులు షేక్ షబానాను కలసిన గిద్దలూరు బీజేపీ నాయకులు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం మున్సిపాల్టీ, ఆగస్టు 8)

మార్కాపురం భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ ఆఫీస్‌లో జిల్లా మైనార్టీ మోర్చ అధ్యక్షులు షేక్ ఖాదర్ వలీ షఫీ ఆధ్వర్యంలో మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ షబానాను,మార్కాపురం అసెంబ్లీ కన్వీనర్ పీవీ కృష్ణారావు మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అపి సెట్టి ఉదయ్‌శంకర్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు పాల్గొన్నారు. గిద్దలూరు చిరకాల సమస్యలయిన రైల్వే బ్రిడ్జి, నీటి సమస్యలు తాగు, వ్యవసాయ అవసరాల గురించి ట్రాఫిక్ సమస్యలు సగి లేరు వరద గురించి అధినాయకత్వానికి తెలియచేసి వాటి పరిష్కారం కోసం తోడ్పాటు అందించాలని కోరారు.

# టీడీపీ కేంద్ర కార్యాలయానికి పోటెత్తిన వైసీపీ బాధితులు

- వారి నుంచి వినతులు స్వీకరించిన మంత్రులు
- ప్రతి సమస్యకు పరిష్కార మార్గం వైపుగా చర్యలు
- చివరి ఫిర్యాదు వరకూ ప్రతి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకున్న మంత్రులు
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో అర్జీలు స్వీకరించిన
- మంత్రులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, బీసీ జనార్ధన్‌రెడ్డి









(షణ్ముఖ వెలుగు, మంగళగిరి, ఆగస్టు 8)

తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రతిరోజు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమానికి గురువారం వినతులతో వైసీపీ బాధితులు, ప్రజలు పోటెత్తారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబులు రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకుల నుంచి అర్జీలు స్వీకరించారు. గురువారం నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి దాదాపు 100కు పైగా ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో భూ సమస్యలు, లా అండ్ ఆర్డర్‌కు సంబంధించిన సమస్యలు అత్యధికంగా ఉన్నాయి. అర్జీదారుల నుంచి మంత్రులు వినతి పత్రాలు తీసుకుని, వారి సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలకు సంబంధించి మంత్రులు సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఫోన్లు చేసి పరిష్కరించాలని ఆదేశించారు. మిగిలిన వినతిపత్రాలను సంబంధిత శాఖ అధికారులకు పంపించి, వాటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మాచర్ల నియోజకవర్గానికి చెందిన బత్తుల లక్ష్మి అనే మహిళ మాచర్ల పట్టణంలో ఉన్న తన 33 సెంట్ల స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి అనుచరులు కబ్జా చేశారని, ఆ స్థలం తనకి ఇప్పించాలని కోరారు. మంగళగిరి నియోజకవర్గం నూతక్కి గ్రామానికి చెందిన తోట నాగమణి అనే 64 ఏళ్ల వృద్ధురాలు.. తన చిన్న కుమారుడు ఆస్తి, నగలు లాక్కొని ఇంటి నుంచి తనను వెల్లగొట్టాడని, ఇంటి వైపు వస్తే చంపుతానంటూ బెదిరిస్తున్నాడని వాపోయింది. తన ఆస్తి నగలు ఇప్పించి తన కుమారుడి నుంచి రక్షణ కల్పించాలని వేడుకుంది. నెల్లూరు జిల్లా కోవూరు మండలం బుదంపాడు గ్రామానికి చెందిన సురేష్ బాబు అనే వ్యక్తి.. వైసీపీ ప్రభుత్వంలో కుట్రపూరితంగా రోడ్డు ప్లానింగ్ మార్చి తన స్థలంలో రోడ్డు వేశారని, స్థానిక వైసీపీ నేతలతో పాటు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా అన్ని ఫిర్యాదులు పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని ఫిర్యాదుదారులకు మంత్రులు హామీ ఇచ్చారు.

# బయో డీజిల్ అక్రమ విక్రయాలపై సమాచారం లేదా తిరుపతి ఎంపీ గురుమూర్తి



(షణ్ముఖ వెలుగు, తిరుపతి, ఆగస్టు 8)

పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ నిబంధనలు పాటించకుండా అనధికార బయో డీజిల్ విక్రయాలు జరుగుతున్నాయని ప్రభుత్వానికి తెలియదా, “రవాణా ప్రయోజనాల కోసం హై-స్పీడ్ డీజిల్‌తో కలపడం కోసం బయో-డీజిల్ అమ్మకానికి సంబంధించిన మార్గదర్శకాలు-2019” బయోడీజిల్ అమ్మకాలను విస్తృతంగా కవర్ చేయలేదనేది నిజమేనా, అలా అయితే దాని వివరాలు దానికి గల కారణాలు, పరిస్థితిని మెరుగుపరిచేందుకు తీసుకొంటున్న చర్యల వివరాలు తెలియజేయాలని తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి పార్లమెంటులో ప్రశ్నించారు. అందుకు సమాధానంగా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖా సహాయ మంత్రి సురేష్ గోపి సమాధానం ఇస్తూ దేశంలో బయోడీజిల్ పేరుతో అనధికా రికంగా బయోడీజిల్‌ను విక్రయించడం, పెట్రోలియం ఉత్పత్తులను అక్రమంగా విక్రయిస్తున్నట్లు ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు ఫిర్యాదులు అందుతున్నాయని ఆయన అన్నారు. ప్రభుత్వం ఇప్పటికే “రవాణా ప్రయోజనాల కోసం హై-స్పీడ్ డీజిల్‌తో కలపడం కోసం బయోడీజిల్ అమ్మకానికి మార్గదర్శకాలు-2019” జారీ చేసిందని తెలిపారు. ఈ మార్గదర్శకాలు బయోడీజిల్ విక్రయాలను నియంత్రణలో ఉంచుతాయని, బయోడీజిల్‌ను విక్రయించే రిటైల్ అవుట్‌లెట్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు అధికారం ఉంటుందని అన్నారు. అలాగే ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలకు కూడా అనధికారకంగా, అక్రమ బయోడీజిల్ తయారీ ప్లాంట్లు, నిల్వ, పంపిణీ యూనిట్లు, రిటైల్ అవుట్‌లెట్‌లను తనిఖీ చేయడం తోపాటుగా స్వాధీనం చేసుకోవడానికి అధికారం ఉంటుందని అన్నారు. అంతేగాక బయోడీజిల్ అక్రమ విక్రయాలపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సలహా ఇస్తూ పెట్రోలియం మంత్రిత్వ శాఖ నుంచి అన్ని రాష్ట్రాలకు లేఖలు రాయడం జరిగిందని తెలిపారు. దేశంలో బయోడీజిల్ పేరుతో విక్రయించబడుతున్న అక్రమ పెట్రోలియం ఉత్పత్తులను విక్రయించకుండా నిరోధించడానికి చమురు మార్కెటింగ్ కంపెనీల అధికారుల తోపాటుగా రాష్ట్ర ప్రభుత్వాలు అనేక తనిఖీలు, దాడులు నిర్వహించాయని తెలిపారు.

# ఆజాదీ కా అమృత్ మహోత్సవం హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 8)

ఆజాదీ కా అమృత్ మహోత్సవాలలో భాగంగా హర్ ఘర్ తిరంగా యాత్ర కార్యక్రమ నిర్వహణ కింద ఈ నెల 8న ఒంగోలు లోని శ్రీ ప్రతిభ జూనియర్ కాలేజీ, స్టెప్ , జిల్లా యువజన సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో శ్రీ ప్రతిభ జూనియర్ కాలేజీ నుంచి పేర్నమిట్ట వరకు 1500 మంది యువతీ, యువకులతో ర్యాలీ చేపట్టారు. తొలుత ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ముఖ్య కార్యనిర్వహణాధికారి యంవిఎస్ లోకేశ్వరరావు మాట్లాడుతూ 75 సంవత్సరముల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమాల్లో భాగంగా ప్రతి సంవత్సరం ఈ హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించ తలపెట్టి మన భారత దేశ ప్రభుత్వం కొన్ని కార్యక్రమాలను నిర్వహించుటకు నిర్ధించినదని ఈ కార్యక్రమాల వలన యువతకు మన స్వాంతంత్ర సమరయోధుల కృషి వారి చేసిన త్యాగాలను స్మరించుకుంటూ యువతలో దేశ భక్తిని పెంపొందించుకోవాలని ఈ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం యువతతో తిరంగా ప్రతిజ్ఞ చేపించి తరువాత 1500 వందల మంది యువతతో 75అడుగుల జాతీయ పతాకంతో తిరంగా యాత్రను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమములో ప్రతిభ కళాశాలల ఛైర్మన్ నల్లూరి వేంకటేశ్వర రావు మాట్లాడుతూ యువత మంచి క్రమశిక్షణతో మెలిగి దేశం పట్ల భక్తి భావాలను కలిగియుండాలని, చెడు వ్యసనలకు దూరంగా వుండి దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో స్టెప్ మేనేజర్ పువ్వాడ శ్రీమన్నారాయణ, నెహ్రూ యువకేంద్ర జిల్లా యూత్ ఆఫీసర్ కమల్ సా, ప్రతిభ కళాశాలల వైస్ ఛైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, స్టెప్ అకౌంటెంట్ జిబిఆర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.






## ఏకగ్రీవంగా ముగిసిన అల్లినగరం ఉన్నత పాఠశాల ఎస్ఎంసి ఎన్నికలు





(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 8)

కొమరోలు మండలం అల్లినగరం లోని మునగనూరి వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి పర్యవేక్షణలో ఎస్ఎంసి ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఈ ఎన్నికలో ముందుగా ఆరు నుంచి 10వ తరగతి వరకు తరగతికి ముగ్గురు చొప్పున మొత్తం 15 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ 15 మంది సభ్యులు కలసి చైర్మన్ గా స్వర్ణ ప్రవీణ్‌ను వైస్ చైర్మన్ గా షేక్ సల్మా భానును ఏకగ్రీవంగా ఎన్ను కొన్నారు. తదుపరి ప్రధానోపాధ్యాయులు గురుస్వామి చైర్మన్ వైస్ చైర్మన్ మిగిలిన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కమిటీ సభ్యులతో ప్రథమ సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల నమోదు హాజరు, డ్రాప్ అవుట్లు, నిర్మూలించుట, బాలిక విద్య అభివృద్ధి మొదలగు అంశాలు చర్చించి వాటిని నెరవేర్చుటకు కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి, ఉపాధ్యాయులు ఎన్నికైన కమిటీ సభ్యులందరికీ అభినందనలు తెలిపారు. చైర్మన్‌గా ఎన్నికైన స్వర్ణ ప్రవీణ్ విద్యార్థులందరికీ విందు భోజనం ఏర్పాటు చేశారు. విందు భోజనం ఏర్పాటు చేసిన ఎస్ఎంసి చైర్మన్ స్వర్ణ ప్రవీణ్ కు ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపి భవిష్యత్తులో కమిటీ సభ్యులు అందరూ కలిసికట్టుగా పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.

# దళితుల పంట ధ్వంసం చేసిన ఎడ్ల మల్లయ్య ముఠా పై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయాలి




### జిల్లా ఎస్పీకి ఫిర్యాదు
### చట్ట ప్రకారం చర్యకై తాళ్లూరు ఎస్ఐని ఆదేశించిన ఎస్పీ
### వైసిపి పాలనలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసు
### తెలుగుదేశం పాలనలో వైసీపీ నాయకుడిపై ఎందుకు నమోదు చేయరు
### దళిత నేత నీలం ప్రశ్న

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 8)**
దళితుల పంటను ధ్వంసం చేసి దురాక్రమణ చేసిన వైసీపీ నాయకుడు కమ్మ కులానికి చెందిన ఎడ్ల మల్లయ్య ముఠాపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం ఎస్సీ, ఎస్టీ బాధిత మహిళలతో కలిసి ఎస్పీ చాంబర్లో గత నెల 14వ తేదీ దళితుల భూమి ఆక్రమించి పంటను ధ్వంసం చేసి దౌర్జన్యానికి పాల్పడిన ఎడ్ల మల్లయ్య ముఠాపై మూడు వారాలైన తాళ్లూరు ఎస్సై విజయ్ కుమార్ నిందితులతో కుమ్మక్కై కేసు కట్టలేదన్నారు. తాళ్లూరు మండలం చింతలపాలెంలో 60 ఎకరాల ప్రభుత్వ భూమి కమ్మ కులస్తులు సాగు చేసుకుంటుండగా కేవలం 10 ఎకరాలు భూమిని మాల, మాదిగ, ఎరుకుల కులాలకు చెందిన తల అర ఎకరం సాగు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో 2021 సంవత్సరంలో ఇదే కమ్మ కులానికి చెందిన లేళ్ల బ్రహ్మయ్య ముఠా ఇదే భూమిని ఆక్రమించుకొని దౌర్జన్యానికి పాల్పడగా క్రైమ్ నెంబర్ 155/21 ఎస్సీ ఎస్టీ కేసు నమోదైంది. ప్రస్తుతం కోర్టులో విచారణ జరుగుతున్నది. ఈ క్రమంలో మరలా ఇదే భూమిని కమ్మ కులానికి చెందిన మరో వైసీపీ నాయకుడు ఎడ్ల మల్లయ్య ముఠా దళితులు పండించుకున్న సజ్జ పంటను ట్రాక్టర్లతో తొక్కించి అడ్డుపడిన ఎస్సీ, ఎస్టీ మహిళలను దూషించి చంపుతామని బెదిరించిన ఘటనపై తాళ్లూరు ఎస్సై విజయ్ కుమార్ భూకబ్జాదారులతో కుమ్మక్కై సివిల్ వివాదం అంటూ ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయలేదు తాళ్లూరు ఎస్సై విజయ్ కుమార్ ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయకపోవడంపై అప్పటి దర్శి డిఎస్పి అశోక్ వర్ధన్ రెడ్డికి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయాలని తాళ్లూరు ఎస్సైకి ఆదేశించారు. కానీ తాళ్లూరు ఎస్సై మరింత రేటు పెంచుకొని గొడుగు పడుతూ కేసు నమోదు చేయలేదు. మరలా బాధితులు గత నెల 29వ తేదీన జిల్లా ఎస్పీకి గ్రీవెన్స్ సెల్లులో ఫిర్యాదు చేశారు. దర్శి సిఐకు ఎస్పీ కార్యాలయం వారు ఫిర్యాదు పంపించిన నేటి వరకు తాళ్లూరు ఎస్సై కేసు రిజిస్టర్ చేయలేదన్నారు.

2021 వ సంవత్సరంలో ఇదే ఎస్సీ ఎస్టీల భూమిని ఆక్రమించిన లీల బ్రహ్మయ్య ముఠాపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు అయినప్పుడు తెలుగుదేశం పాలనలో మరల ఇదే ఎస్సీ ఎస్టీల భూమిని వైసీపీ నాయకుడు ఎడ్ల మల్లయ్య ముఠా ఆక్రమించి దౌర్జన్యానికి పాల్పడితే ఎందుకు ఎస్సీ ఎస్టీ కేసు తాళ్లూరు ఎస్సై విజయ్ కుమార్ నమోదు చేయడం లేదన్నారు.

సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదుల్ని ఎటువంటి విచారణ లేకుండానే ఎఫ్ఐఆర్ కట్టవలసి ఉందని కానీ ఎస్సీ ఎస్టీల పంటను ధ్వంసం చేసి చంపుతామని బెదిరించి వైసిపి నాయకుడు ఎడ్ల మల్లయ్య ముఠాపై తాళ్లూరు ఎస్సై విజయ్ కుమార్ కేసు పెట్టకపోవడం నేరమన్నారు. ఎస్పీని కలిసిన వారిలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య, బాధ్యత మహిళలు ఉన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి గొట్టిపాటి









**(షణ్ముఖ వెలుగు,అద్దంకి, ఆగస్టు 8)**
సంతమాగులూరు, కొమ్మాలపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చెన్నుపల్లి పెద్ద మీరాస గురువారం ఉదయం గుండెపోటుతో హఠాన్మరణం చెందగా గురువారం వారి పార్థీవదేహానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అద్దంకి గరటయ్య కాలనీకి చెందిన ఒంటెల రాఘవ కుమారుడు మణికంఠ(6) రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి నివాసానికి వెళ్లి తల్లిదండ్రులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన అడుసుమల్లి హనుమంతరావు ఇటీవల మృతి చెందగా గురువారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. 18 వ వార్డుకు చెందిన తన్నీరు వెంకటేశ్వర్లు ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. 14వ వార్డులో గుంజి శ్రీనివాసరావు ఇటీవల మృతి చెందగా వారి చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. 11వ వార్డులో గుమ్మడి శివపార్వతి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ప్రశాంతంగా ముగిసిన పేరెంట్స్ కమిటీ ఎన్నికలు





**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఆగస్టు 8)**
మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్స్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పెద్దారవీడు మండలంలో 58 పాఠశాలలు ఉండగా 51 చోట్ల ఈ పేరెంట్స్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 7 చోట్ల, మద్దలకట్ట, చాట్ల మడవా, రాజంపల్లి, చట్లమీట్ల ఓబులక్కపల్లి మరియు చెర్లోపల్లి, స్థానికవరం, గ్రాలలో కోరం లేక వాయిదా పడ్డాయి. అత్యధికంగా ఏకగ్రీవం కాగా కొన్ని చోట్ల పోటీలు పడ్డారు. బద్వీడు చర్లపల్లి గ్రామంలో మొత్తం మూడు పాఠశాలలు ఉండగా రెండు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రజా పరిషత్తు పాఠశాలలో వైసిపి అభ్యర్థులు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సౌరిబాబు అధ్యక్షనతో వైసిపి బలపరిచిన అభ్యర్థి కోటపాటి అల్లూరయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు మాడుగుల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ డీలర్ మూల రమణారెడ్డి, తిమ్మారెడ్డి, రామకోటిరెడ్డి, పాల్గొన్నారు జిల్లా పరిషత్ హై స్కూల్ నందు టిడిపి అభ్యర్థులు బీ. బాలకృష్ణనీ, సర్పంచి ఆకుమల శ్రీనివాసరెడ్డి మరియు ప్రధానో పాధ్యాయులు రత్న శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గుండంచర్ల గ్రామంలో టిడిపి అభ్యర్థులు బలపరిచినవారు సర్పంచి ఇండ్ల రామ కృష్ణారెడ్డి మరియు ప్రధాన ఉపాధ్యాయుడు ఆధ్వర్యంలో చైర్మన్గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బద్వీడు గ్రామంలో ఆధ్వర్యంలో వైసీపీ అభ్యర్థిని ఏ గ్రామంలో ఎన్నుకున్నారు. సుంకేసుల గ్రామంలో మూడు పాఠశాలలు ఉండగా మూడు పాఠశాలలను టిడిపి మద్దతుదారుల ఏసిగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రగుంట నాగేశ్వరరావు మాజీ సర్పంచ్ మనలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల కేంద్రమైన పెద్దరవీడు గ్రామంలో ఆరు పాఠశాలలు ఉన్నాయి, ఆరు పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్ టిడిపి అభ్యర్థులు, మాజీ మండల కన్వీనర్ గొట్టం శ్రీను ఆధ్వర్యంలో కైవసం చేసుకున్నారు. గొబ్బూరు గ్రామంలో మండల ప్రజా పరిషత్ స్కూలు, జిల్లా పరిషత్ స్కూల్ ను రెండు సర్పంచ్ అంగిరేకుల ఆదినారాయణ యాదవ్ మరియు వైస్ ఎంపీపీ గుండా రెడ్డి వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి అభ్యర్థులు కైవసం చేసుకున్నారు.

# సామంతమల్లాం హరిజనవాడలో మెడికల్ క్యాంప్

**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, ఆగస్టు 8)**
తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం సామంత్ మండలం పంచాయతీలోని హరిజనవాడలో గురువారం ఏఎన్ఎం సుధా ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ఈ మెడికల్ క్యాంప్ నందు రోగులకు మెడిసిన్ ఇస్తూ, గ్రామంలో



ప్రతి ఇంటిని సందర్శించి లార్వ టెస్టులు చేస్తూ, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియజేస్తూ గ్రామంలో నీరు నిల్వ ఉన్నచోట బ్లీచింగ్ చల్లి డెంగీ, మలేరియా, టైఫాయిడ్, జ్వరాలపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ఎవరికైనా జ్వరాలు గానీ ఏ ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్న ఆశా వర్కర్ గాని, ఏఎన్ఎం గాని తెలియజేయాలని, ప్రతి ఇంటికి తిరుగుతూ తెలియజేశారు.

# ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి సొసైటీ కమిటీ సభ్యులు నియామకం



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 8)**
కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు, ఉలవపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించి అభివృద్ధి సొసైటీ కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీకి చైర్మన్‌తో పాటు ఏడుగురు సభ్యులను నియమిస్తూ జిల్లా అధికారులు నుంచి ఆదేశాలు మేరకు కమిటీ చైర్మన్ ప్రథమ ప్రాధాన్యత సభ్యులుగా నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వ్యవహరిస్తారు. మిగతా సభ్యులుగా వర్ధినేని శ్రీనివాస్ (చాగొల్లు), డాక్టర్ బి.వి పవన్ (ఉలవపాడు), సన్నెబోయిన ప్రభావతి (ఉలవపాడు), జి.హరీష్ (మెడికల్ ఆఫీసర్), ఎన్. విజయ (ఎంపీడీవో), బి.విజయమ్మ (పంచాయతీ కార్యదర్శి) ఉంటారు. ఐదేళ్లపాటు వీరు పదవుల్లో కొనసాగుతారు.ఎమ్మెల్యేను కలిసిన సభ్యులు కమిటీ సభ్యులు వర్ధినేని శ్రీనివాస్, డాక్టర్ పవన్ తోపాటు మెడికల్ ఆఫీసర్ హరీష్‌లు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, సత్వర వైద్య సేవలు అందేలా కమిటీ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు సహాయ ,సహకారాలతో ఆసుపత్రి అభివృద్ధికి కృషిచేస్తామని సభ్యులు తెలిపారు.

# కావలి నడిబొడ్డున ఐకానిక్ జాతీయ జెండా

### కావలి ఖ్యాతిని దశ దిశల వ్యాప్తి చెందే విధంగా సెల్ఫీ పాయింట్
### పేదవాడికి పట్టెడు అన్నం పెట్టే అన్న క్యాంటీన్
### భారతీయుడు సగర్వంగా సెల్యూట్ చేసే జాతీయ జండా
### ఆగస్టు 15న జాతికి అంకితం
### 100 అడుగుల జాతీయ జెండాతో కావలికి ప్రత్యేక గుర్తింపు
### ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 8)**
100 అడుగుల జాతీయ జెండాతో, మహనీయుల చిత్రపటాలతో కావలికి ప్రత్యేక గుర్తింపు రానుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరిలో జాతీయభావం పెంపొందేలా కావలి పట్టణంలోని ఎంఎం బేకరీ సెంటర్‌లో అన్న క్యాంటిన్ ఎదురుగా నిర్మాణం చేపడుతున్న 100 అడుగుల జాతీయ పతాకంకు సంబంధించిన పనులను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పరిశీలించారు. కావలి పట్టణానికి ఒక ఐకానిక్ ఉండేలా ఎమ్మెల్యే సొంత నిధులతో, స్వీయ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపడుతున్నారు. పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌కు తగు సూచనలు చేశారు. డిజైన్ ప్రకారం త్వరితగతిన పనులు చేపట్టి ఆగస్టు 15న ప్రారంభం అయ్యేలా చూడాలని తెలిపారు.

# బకింగ్ హామ్ కాలువ మీద బ్రిడ్జి సత్వరమే పూర్తి చేయాలి

### ఎమ్మెల్యే దామచర్లను కలిసిన
### బిజెపి ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ వైసీ యోగయ్య యాదవ్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 8)**
బకింగ్ హామ్ కాలువ మీద సత్వరమే బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌ను బిజెపి ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ వైసీ యోగయ్య యాదవ్ కోరారు. గురువారం ఎమ్మెల్యే దామచర్ల ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు అభివృద్ధి అంశాలపై ఆయన చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఒంగోలు నుంచి కొత్తపట్నం మధ్యలో ఉన్న బకింగ్ హామ్ కాలువ మీద బ్రిడ్జి సత్వరమే పూర్తి చేయాలని కోరారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాజెక్టులో గత ప్రభుత్వ హయాంలో కొట్టుక పోయిన లాక్స్ యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి నీరు సముద్రం పాలు కాకుండా కాపాడి ఒంగోలు ప్రజల చిర కాల కోరిక ఐన ప్రతి రోజు మంచి నీరు అందించాలని కోరారు. గత ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలలో భాగంగా తొలగించిన వృద్ధాప్య పింఛన్లు పునరుద్ధరించా లని కోరారు. గత ప్రభుత్వ కాలంలో జరిగిన నకిలీ స్టాంపులు, భూ కుంభకోణాలపైన ఎంక్వైరీ వేసి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. మైనింగ్ జోన్‌లో ఉన్నది అని తెలిసి కూడా గత ప్రభుత్వం యరజెర్ల కొండను గుండు చేసిన భాద్యుల పైన చర్యలు తీసుకోవాలని బిజెపి డిమాండ్ చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం చేసే మంచి కార్యక్రమాలకు బిజెపి మద్దతుగా ఉంటుందన్నారు. పేద ప్రజల కోసం ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ లకు బిజెపి పూర్తిగా మద్దతు తెలుపుతుందని ఆయన తెలిపారు.

# తహసీల్దార్‌ను కలిసిన టిడిపి నేతలు



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 8)**
నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పొదిలి మండల తహసీల్దార్ ఎం వి కృష్ణారెడ్డిని స్థానిక టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. తహశీల్దార్‌ను సత్కరించిన వారిలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట కార్యదర్శి వరికుంట్ల అనిల్, జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, టీడీపీ నాయకులు ఉలవ గోపి, సామంతపూడి నాగేశ్వరరావు, తానికొండ వెంకట్రావు, సుబ్బారావు, యాసిన్, అరిక రాము, ఈశ్వర్‌రెడ్డి, మాదర్ వలి, తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్‌ను సత్కరించిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు8)
నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పొదిలి మండల తహసీల్దార్ ఎంవి కృష్ణారెడ్డిని గురువారం ఆయన కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల బొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ జిలాని భాష, తెలుగుదేశం పార్టీ నాయకులు సామి రాజా, సోమిశెట్టి చిరంజీవి, వరికుంట వెంకటేశ్వర్లు (సరైనోడు), కోటి, తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్‌ను కలిసిన మండల బిజెపి నాయకులు



(షణ్ముఖ వెలుగు, చేజర్ల, ఆగస్టు 8)
చేజర్ల మండల భారతీయ జనతా పార్టీ నాయకులు గురువారం చేజర్ల తహసిల్దార్‌ను కలిశారు. ఇటీవల నూతన బాధ్యతలు చేపట్టిన చేజర్ల తహసీల్దార్ ఏవి రమణరావును మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రజలు ఇబ్బంది పడుతున్న పలు రెవెన్యూ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు కుంకు బాలయ్య నాయుడు, బత్తల కృష్ణయ్య, కామంచి భద్రయ్య, తెల్లపాటి వెంకట రామానాయుడు, కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతన మేనేజ్మెంట్ కమిటీ ఎన్నిక





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 8)
మండల కేంద్రమైన ఉలవపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు గురువారం రోజున పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ ఎన్నిక ఉదయం 9గంటలకు ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి విద్యార్థులు తల్లిదండ్రులు హాజరైనారు. పాఠశాలలో ఉన్న మూడు నుంచి పదవ తరగతి వరకు ప్రతి తరగతిలో నుంచి ముగ్గురు సభ్యుల్ని ఎన్నుకోవడం జరిగింది. ఆ విధంగా మూడు నుంచి పదో తరగతి వరకు 24 మంది సభ్యులని ఎన్నుకున్నారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు ఎన్నికైన 24 మంది సభ్యులలో ఒకరిని చైర్మన్ గాను మరొకరిని వైస్ చైర్మన్‌గాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఆర్. ఉమామహేశ్వరిని ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా పి.శ్రీనివాసులుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు పరిశీలకులుగా కరేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వి.వెంకటేశ్వర్లు పరిశీలకులుగా వ్యవహరించారు. ఎన్నికల అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల చేత ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. శివ నాగేశ్వరావు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# కళలు సంస్కారాన్ని, మానవతా విలువలు ప్రబోధిస్తాయి

## ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు









(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 8)
కళలు సంస్కారాన్ని మానవతా విలువలను ప్రబోధిస్తాయని ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు ఈదర హరిబాబు అన్నారు. లాయరుపేట సాయిబాబా మందిరంలో శ్రీ రాఘవ కూచిపూడి నృత్య సంగీత కళానిలయాన్ని గురువారం ప్రారంభించారు. కళానిలయం ద్వారా సంగీతం నృత్యం నటన శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చిన నిర్వాహకులు కరవది సాయి శరణ్య, కరవది సాయి శ్రావ్యలను అభినందించారు. స్వర్గీయ రాఘవకు ఎన్టీఆర్ కళాపరిషత్ సుదీర్ఘకాల అనుబంధం ఉందని గుర్తుచేశారు. పౌరాణిక పాత్ర పోషించటంలో సిద్ధహస్తుడని హరిబాబు కొనియాడారు. కరవది రాఘవ కుటుంబం స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం అని కరవది వెంకటేశ్వర్లు స్వాతంత్ర్య సమరయోధులుగా స్వాతంత్ర్య పోరాటంలో పనిచేశారని సభకు అధ్యక్షత వహించిన ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వెంకటశ్రీనివాసులు అన్నారు. కళాసేవ ద్వారా మంచి సమాజాన్ని నిర్మించవచ్చునే సదుద్దేశంతో తమ కుమార్తెలను సంగీత నృత్య కళాకారులుగా తీర్చిదిద్దారన్నారు. ఈ సందర్భంగా శ్రీ కళా ప్రకాశం అధ్యక్షులు, నంది అవార్డు గ్రహీత చిట్టా వెంకట శివ ప్రసాద్, నళినీ ప్రియ కూచిపూడి నృత్యనికేతన్ అధ్యక్షురాలు ఎస్.వి.శివకుమారిలను ఘనంగా సత్కరించారు. సభా ప్రారంభం ముందు కరవది సాయి శరణ్య ఆలపించిన శాస్త్రీయ సంగీతం, కరవది శ్రీనివాస్ ప్రదర్శించిన విశ్వామిత్ర ఏకపాత్రాభినం, సాయి శ్రావ్య శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అలరించింది. కార్యక్రమంలో కరవది నాగలక్ష్మి, సుమంత్, జశ్వంత్, లాయరుపేట సాయిబాబా మందిరం నిర్వాహకులు డాక్టరు రావిప్రసాదరావు, రుద్రవరం సాయి, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కులమతాలకు పార్టీలకతీతంగా ప్రాంతాల అభివృద్ధి

## రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి







(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 8)
నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 33వ డివిజన్, వెంగళరావు నగర్‌లో షుమారు 20 లక్షల రూపాయల నిధులతో సిసి రోడ్ల పనులకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ కరణం మంజుల శంకుస్థాపన చేశారు. రాబోయే రెండు నెలల్లో 33వ డివిజన్ అభివృద్ధికి కోటి రూపాయలు మంజూరు చేస్తామన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఆ తరువాత కులాలకు, మతాలకు, పార్టలకు అతీతంగా రాజకీయ విభేదాలు పక్కనపెట్టి ప్రాంతాల అభివృద్ధికి అందరం ప్రశాంత వాతావరణంలో పని చేసుకుందామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. నా లక్ష్యం ఒక్కటే. ఎన్డీయే ప్రభుత్వంలో అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాలన్నారు. గత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో ఆర్థికంగా దివాళా తీసిన ఆంధ్ర రాష్ట్రాన్ని నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గాడిన పెడుతున్నారన్నారు. పారిశుధ్య కార్యక్రమాలలో ముఖ్యంగా ప్రజా భాగస్వామ్యం ప్రజల సహకారం అవసరమని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జులు మన్నెం పెంచల నాయుడు, జలదంకి సుధాకర్, టీడీపీ నాయకులు హాజరత్ నాయుడు, బీజేపీ నాయకులు మండ్ల ఈశ్వరయ్య, టిడిపి నాయకులు వెంకట రమణ య్య, మెట్టు క్రాంతి, రమణయ్య నాయుడు, డిష్ చిన్న, నాని, కళ్యాణి, నిర్మలమ్మ, మౌలాలి, ఆనంద్, లాల్ మస్తాన్, కిషోర్ రాజు, సుబ్బయ్య, అశోక్, రమేష్ రెడ్డి, అభి, హరి, దాసరి పెంచలయ్య, మజీద్, అస్లాం, షేక్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థి రుద్రనేత్ర కాలేజీ ఫీజుకు సూర్య శ్రీ ట్రస్ట్ ఆర్థిక సాయం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 8)
ఒంగోలులోని సత్యానా రాయణపురం నందు నివసిస్తున్న ఒక పేద కుటుంబానికి చెందిన రుద్రనేత్ర అనే విద్యార్థికి కాలేజీ ఫీజు నిమిత్తం ప్రవాస భారతీయుడు మహేష్ తుమ్మల సహకారంతో 24 వేల రూపాయలను సూర్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో సెక్రటరీ సర్దార్ భాష చేతుల మీదుగా చెల్లించారు. ట్రస్ట్ సెక్రటరీ సర్దార్ భాష మాట్లాడుతూ రుద్రనేత్ర విద్యార్థి యొక్క నాన్న ఒక చిన్న హోటల్లో క్లీనింగ్ పనిచేస్తూ ఉంటారు. అమ్మ ప్లాస్టిక్ సామాన్లు అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వారిద్దరికీ వచ్చే ఆదాయం కుటుంబానికి సరిపోతుంది కానీ పిల్లల్ని చదివించడానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతూ పదో తరగతిలో మంచి మార్కులు వచ్చినప్పటికీ ఇంటర్మీడియట్ చదివించడానికి స్తోమత లేక గతంలో మేము చేసిన కార్యక్రమాలను చూసి మా యొక్క ట్రస్ట్ ని సంప్రదించగా మేము ఆ కుటుంబం యొక్క పరిస్థితిని చూసి ఈరోజు ఆ విద్యార్థికి కాలేజీ ఫీజు, బుక్స్, యూనిఫాంకు సాయం చేయడం జరిగింది. అలాగే ఇంకా ఎవరైనా పేద విద్యార్థులు మంచి మెరిట్ ఉన్న వారు ఎవరైనా సరే మా ట్రస్ట్‌ని సంప్రదిస్తే విద్యార్థిని, విద్యార్థులు యొక్క చదువులకు తగిన విధంగా దాతల సాయంతో మేము సహాయం చేయగలనని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూరి శ్రీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, జనసేవ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా వెలిశెట్టి, వైస్ చైర్మన్‌గా తాళ్లూరి









(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 8)
పొదిలి పెద్ద బస్టాండ్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్‌గా వెలిశెట్టి ఆదిలక్ష్మి, వైస్ చైర్మన్‌గా తాళ్లూరి మత్తయ్యలను ఏకీగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాల హెడ్మాస్టర్ ఎన్‌వీఎస్ కుమార్, కన్వీనర్గా బాధ్యతలు వహించి 24 మంది కమిటీ సభ్యులను విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు, పెద్దల సమక్షంలో చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఎన్‌వీఎస్ కుమార్ తెలిపారు. ఎన్నిక ఏకగ్రీవంగా జరగటంతో చైర్మన్, వైస్ చైర్మన్,కమిటీ సభ్యులకు విద్యార్థుల తల్లిదండ్రులకు పెద్దలకు కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయునులు, తెలుగుదేశం పార్టీ నాయకులు ముని శ్రీను, జ్యోతి, మల్లీ, బొడ్డు సుబ్బయ్య, వెలిశెట్టి సురేష్ సామి, రాజా, సోమిశెట్టి శ్రీదేవి, సోమిశెట్టి చిరంజీవి, వరుకూటి వెంకటేశ్వర్లు ,ఆదిమూలపు రవి, షేక్ సందని భాష, కోటి, ఇమ్రాన్, ఉస్మాన్, మొదలగు వారు పాల్గొన్నారు.ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నార్త్ హెచ్ఎం సీహెచ్ వెంకటేశ్వర్లు, కన్వీనర్‌గా బాధ్యతలు తీసుకుని విద్యా కమిటీ చైర్మన్‌గా షాహినా వైస్ చైర్మన్‌గా శిరీషలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు.

# రహదారి సదుపాయం లేని ప్రాంతాల వారికి సైతం న్యాయ సేవలు

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ కే శ్యాంబాబు**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 8)**

న్యాయ సేవ అధికార సంస్థ సేవలు అందని వర్గాలకు, రోడ్డు సదుపాయం రహదారి సదుపాయం లేని ప్రాంతాల వారికి సైతం న్యాయ సేవలు అందించే ఉద్దేశ్యంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి , సీనియర్ సివిల్ జడ్జ్ కే శ్యాంబాబు అన్నారు. ఒంగోలు పట్టణంలోని విభిన్న ప్రతిభావంతుల వసతి గృహంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారు సూచనలు మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.భారతి ఆదేశానుసారం నూతన సేవల శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేకమైన చట్టాలు ఉన్నాయని, వారిని తోటి సమాజంలో ఎవరైనా గేలి చేసిన శారీరకంగా గాని, మానసికంగా గాని రకంగా గాని ఇబ్బంది పెట్టిన చట్టప్రకారం శిక్షార్హులన్నారు. ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విభిన్న ప్రతిభావంతుల శాఖ అదనపు సంచాలకులు జి.అర్చన మాట్లాడుతూ అర్హత గల వారికి అందవలసిన ప్రభుత్వ పథకాలన్నీ అందే విధంగా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ మానసిక వైద్యురాలు బి. పూజిత మాట్లాడుతూ ఎటువంటి మానసిక సమస్యనైనా వైద్యుల్ని సంప్రదించి నివృత్తి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బదిరుల పాఠశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, వారి సిబ్బంది పాల్గొన్నారు.

# దరిమడుగు బాయ్స్ పాఠశాల చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ప్రశాంతం



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఆగస్టు 8)**

మార్కాపురం మండలం దరిమడుగు గ్రామంలో ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ బాయ్స్ పాఠశాల నందు ప్రధానోపాధ్యాయుడు ఆధ్వర్యంలో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. చైర్మన్‌గా తోకల శ్రీనివాస్‌లు చైర్మన్ ఏకీగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మార్గదర్శకాలు మేరకు ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులను ఎన్నుకోవడం జరిగిందని ఎన్నుకున్న 15 మంది సభ్యులలో చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని, ఇలాంటి ప్రశాంతమైన వాతావరణంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు జరగడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. మాట్లాడుతూ చైర్మన్‌గా ఎన్నికైన ఇరువురు పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని ఎప్పటికప్పుడు విద్యార్థుల చదువుపట్ల మధ్యాహ్నం భోజనం విద్యార్థుల వసతులు ఏర్పాట్ల విషయంలో మీ వంతు సహకారం పాఠశాలకు ఎల్లప్పుడూ ఉండాలని పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మన గ్రామానికి మంచి పేరు తీసుకుని వచ్చి మండలంలోని కాదు జిల్లాలో ఒక గుర్తింపు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు సిబ్బంది ఎన్నికైన సభ్యులు పాల్గొన్నారు.

# బురుజుపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల

**విద్యా కమిటీ చైర్మన్‌గా అరిగేల లక్ష్మి నారాయణ**



**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 8)**

మండలంలోని బురుజుపల్లి గ్రామంలోని మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన విద్యా కమిటీ ఎన్నికల్లో చైర్మన్‌గా అరిగేల లక్ష్మి నారాయణ, వైస్ చైర్మన్‌గా పగడాల నాగమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కమిటీకి గ్రామ ఉప సర్పంచ్ కడియం శేషగిరి, అరిగేల వీరనారాయణ, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ పీరాఖాన్, సయ్యద్ భాష, మండ్ల రంగనాయకులు, మహబూబ్ భాష గ్రామస్థులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎస్ కొత్తపల్లి గ్రామ పాఠశాల చైర్మన్ ఏకగ్రీవం



**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఆగస్టు 8)**

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా ఎలనాటి మోసే వైస్ చైర్మన్‌గా తిరుమలరెడ్డి పార్వతిలను ఏకీగ్రీవంగా ఎన్నుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు ఉదయగిరి వెంకట్రావు ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు, పెద్దల సమక్షంలో చైర్మన్, వైస్ చైర్మన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఉదయగిరి వెంకట్రావు తెలిపారు. ఎన్నిక ఏకగ్రీవంగా జరగటంతో చైర్మన్ , వైస్ చైర్మన్ , కమిటీ సభ్యులకు విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తిరుమలరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఆవుల సుబ్బారావు, కాలంగి సత్యనారాయణ, తిరుమలరెడ్డి కృష్ణారెడ్డి, తిప్పన బోయిన నాగ విష్ణు, తిప్పనిపోయిన సుబ్బారావు, తిరుమలరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కందుకూరి రంగారావు పాల్గొన్నారు.

# మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన మస్తానయ్య



**(షణ్ముఖ వెలుగు, విజయవాడ, ఆగస్టు 8)**

రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను గురువారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో దూదేకుల మస్తానయ్య మర్యాదపూర్వకంగా కలిసి దృశ్యాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా దూదేకుల మస్తానయ్య మంత్రితో మాట్లాడుతూ మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అడుగుజాడలలో నడుచుకొంటూ పార్టీకి విధేయుడుగా క్రమశిక్షణ విధేయతతో మొదటి నుంచి పనిచేస్తూ ఉన్నానని తెలిపారు. తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా కొనసాగుతున్న తనను దూదేకుల కార్పొరేషన్ చైర్మన్'గా నియమించడానికి అవకాశం కల్పించవలసిందిగా పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లడానికి తన వంతు కృషి చేయాలని కోరారు. అత్యంత వెనుకబడిన ప్రకాశం జిల్లా నుండి ప్రాతినిధ్యం కల్పించాలని ఈ సందర్భంగా తెలిపారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పొదిలికొండపల్లెకు నూతన పాఠశాల యాజమాన్య కమిటీ





**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 8)**

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పొదిలికొండ పల్లెలో గురువారం నూతన పాఠశాల యాజమాన్య కమిటీకి ఎన్నికలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం. రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఎలక్షన్ల అబ్జర్వర్ కృష్ణమోహన్ రెడ్డి సమక్షంలో నిర్వహించారు. పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షులుగా కాల్వ. మహేశ్వరరావు, ఉపాధ్యక్షురాలుగా శనివారపు శివలక్ష్మి, సభ్యులుగా లక్ష్మీదేవి, జయలక్ష్మి, రంగస్వామి, నాగలక్ష్మి తదితరులను ఎన్నుకోవడం జరిగింది. ఎక్స్ అఫిసియో సభ్యులుగా డాక్టర్ మొర్రి. పిచ్చయ్య, లక్ష్మి ఓబులమ్మ, రత్తమ్మ, రాజ్యలక్ష్మి, రజితలను మరియు కో ఆప్టేడ్ మెంబర్స్‌గా ఆవుల గోపాల్, బడా మల్లికార్జునలను కమిటీ సభ్యులు నామినేట్ చేయడం జరిగింది. అనంతరం కమిటీ సభ్యుల చేత ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఎన్నికల అబ్జర్వర్ కృష్ణమోహన్ రెడ్డి నిర్వహించారు. అనంతరం నూతన కమిటీ మొదటి సమావేశాన్ని నిర్వహించి పాఠశాల అభివృద్ధికి చేయవలసిన కార్యాచరణ చర్చించడం జరిగింది. ఈ ఎన్నికల ప్రక్రియలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది చురుకుగా పాల్గొని సమర్థవంతంగా నిర్వహించినందుకు ప్రధానోపాధ్యాయులు అభినందించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ఖాదరవలి ఎంఆర్‌సికి అందజేశారు.

# ఎస్ఎంసి చైర్మన్‌గా గుత్తి కొండలరావు



**(షణ్ముఖ వెలుగు, పామూరు, ఆగస్టు 8)**

పామూరు పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎస్‌యంసి నూతన మేనేజ్మెంట్ చైర్మన్ గుత్తి కొండలరావు, వైస్ చైర్మన్‌గా ఆరితోటి లక్ష్మి వీరితోపాటుగా కమిటీ సభ్యులుగా 13 మందిని ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికల సీనియర్ ఉపాధ్యాయుడు ఎన్నికల కన్వీనర్‌గా ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు జి.భోగేశ్వర రావు ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా నిర్వహించారు. ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నికల ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లి దండ్రులు టిడిపి,జనసేన నాయకులు పామూరు మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, ఉప్పలపాటి హరిబాబు, నర్సింగ్ సాంబశివరావు, షేక్ ఖాజా రంతుల్లా, బిజెపి నియోజకవర్గ నాయకులు కొండిశెట్టి రమణయ్య, జనసేన నాయకులు కొండలు బండ్ల నారాయణ, ఆర్ ఆర్ రఫీ షేక్ పత్తు మస్తాన్, షేక్ మాచర్ల రహిమన్, షేక్ చిన్న హజరత్, గుత్తి మహేష్, శేషం మోశే, ఓగూరి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన వరుడును ఆశీర్వదించిన ఆదాల



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 8)**

నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రూరల్ ఇన్చార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి 20వ డివిజన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, క్లస్టర్–2 ఉపాధ్యక్షులు దువ్వూరు భాస్కర్ రెడ్డి కుమారుడు డాక్టర్ దువ్వూరు వరుణ్ రెడ్డి వివాహం సందర్భంగా గురువారం నెల్లూరు నగరంలోని హొటల్ మినర్వా గ్రాండ్ లో ఏర్పాటుచేసిన నలుగు శుభ మహోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డిగారు నూతన వరుడుకు అక్షింతలు వేసి శుభ ఆశీస్సులతో దీవించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, 20వ డివిజన్ ఇన్చార్జ్ తాళ్లూరు సురేష్ బాబు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వర్ణ వెంకయ్య, లేబూరు పరమేశ్వర రెడ్డి, సిహెచ్ హరిబాబు యాదవ్, పుచ్చలపల్లి రాంప్రసాద్ రెడ్డి, బట్టేపాటి నరేంద్రరెడ్డి, ఏసునాయుడు, పాశం శ్రీనివాస్, వేణుగోపాల్ రెడ్డి, కొండూరు దిలీప్ కుమార్ రెడ్డి, సిహెచ్ సూరిబాబు, మహిళా నాయకురాలు కల్లూరు లక్ష్మీరెడ్డి, వైవీ రెడ్డి, కొండేటి నరసింహరావు, శ్రీధర్ బాబు, గుంటక వంశీ, ఖలీల్, మొయిండ్దీన్, ఆదిత్య, బెల్లంకొండ వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నాగిరెడ్డి చిత్ర పటానికి నివాళులు



**(షణ్ముఖ వెలుగు, ఆత్మకూరు, ఆగస్టు 8)**

ఆత్మకూరు నియోజకవర్గం సంగం మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి బాణా శ్రీనివాసులు రెడ్డి తండ్రి నాగిరెడ్డి ఉత్తర క్రియలు సందర్భంగా, సంగం మండలం వేంకటేశ్వరపురంలోని వారి నివాసంలో నాగిరెడ్డి చిత్ర పటానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి పరామర్శించారు. వీరి వెంట తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు ఏస్‌కె రసూల్,నెల్లూరు పార్లమెంట్ తెలుగు, యువత ప్రధాన

# అర్హులైన ప్రతి ఒక్కరికీ కౌలుదారు కార్డులు పంపిణీ చేయాలి





**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఆగస్టు 8)**

కలెక్టర్ ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ కౌలుదారు కార్డులు పంపిణీ చేయాలని హనుమంతునిపాడు మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బి.దిలీప్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కిషోర్ కుమార్‌రెడ్డి, అగ్రికల్చర్ రమణ, అగ్రికల్చర్ ఎక్సటెన్షన్ ఆఫీసర్ గోపి కృష్ణతో అందరూ గ్రామ అగ్రికల్చర్ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి కౌలుదారు కార్డులు జారీ విషయంలో లక్ష్యాన్ని చేరుటకు కావలసిన సూచనలు చేశారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# మహిళా సాధికారతకు చేయూతనిస్తున్న మాగుంట కుటుంబం

## పేదింటి మహిళల పట్ల కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ
## శిక్షణ తరగతులు పూర్తి చేసుకున్న వైనం
## సమాజంలో మహిళలు ప్రగతి పదంలో ముందుండాలి
## మాగుంట కుటుంబం

(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, ఆగస్టు 8)
మండలంలోని ఉల్లపాలెం గ్రామపంచాయతీ నడిబొడ్డున గురువారం నాడు ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడు మాగుంట రాఘవరెడ్డి సౌజన్యంతో మాగుంట చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మహిళలు స్వయం సమృద్ధి సాధించి మహిళా సాధికారత దిశగా వారి ఎదుగుదలకు కుటుంబ పోషణకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారి జీవనోపాధి కొరకు రోజురోజుకీ అభివృద్ధి చెందాలని మంచి సంకల్పంతో మాగుంట కుటుంబం ఉచితంగా ఉల్లపాలెం గ్రామంలో మహిళలకు కుట్టు మిషన్లు బహూకరించారు. 24 కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందిన మహిళలకు ప్రత్యేకంగా ఉచితంగా మాకుంట కుటుంబం వారికి కుట్టు మిషన్లు వారి జీవనోపాధి కొరకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మాగుంట చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి పుచ్చలపల్లి సాగర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకంగా మహిళలకు కుట్టు మిషన్‌లు పంపిణీ చేసేందుకు మాగుంట కుటుంబం తరఫున తాము వచ్చామని చెప్పడంతో అందుకు అక్కడ మహిళలు మాగుంట కుటుంబం పట్ల ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో మాగుంట కుటుంబం పలు సేవా కార్యక్రమాలు చేస్తుందని, దీనిలో భాగంగానే మహిళలు తమ కుటుంబం పోషణకు స్వతంత్రంగా ఎదగాలనే ఉద్దేశంతో కుట్టుమిషన్లు అందిస్తున్నామన్నారు. ఈ అవకాశం ప్రతి ఒక్క మహిళ గుర్తించుకొని సాటి మహిళలు శిక్షణ పొందిన వారిని చూసి ఇతర మహిళలు కూడా ఇలాంటి రంగాలలో పోటీపడి మీరు ఉచితంగా ఈ కుట్టు మిషన్లు అందుకునే విధంగా శిక్షణ పూర్తి చేసుకొని గుర్తింపు తెచ్చుకోవాలని ఆయన మహిళలను కోరారు.





ఈ కార్యక్రమంలో ఉల్లపాలెం గ్రామపంచాయతీ సర్పంచ్ పాకనాటి అనసూయమ్మ, ఉల్లపాలెం మాజీ సర్పంచ్ తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకుడు బైరెడ్డి మురళి, నూతలపాటి కృష్ణ చైతన్య, కానాల బాలాజీ, ధన్యాసి హరిబాబు, మాగుంట రాఘవరెడ్డి యూత్ ఫోర్స్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మోటుపల్లి కిషోర్ యాదవ్, రోటరీ క్లబ్ ప్రధాన కార్యదర్శి పంతగాని వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# వేగినాటి కోటయ్య ఆశయాల దిశగానే మన ప్రయాణం టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు





(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, ఆగస్టు 8)
అమానిగుడిపాడు గ్రామంలో అంగరంగ వైభవంగా వేగినాటి కోటయ్య, వద్లమూడి వెంకట సుబ్బయ్య విగ్రహావిష్కరణ మహోత్సవం నిర్వహించారు. యర్రగొండపాలెం మండలం అమానిగుడిపాడు గ్రామంలో వేగినాటి కోటయ్య, వద్లమూడి వెంకట సుబ్బయ్య విగ్రహాలను యర్రగొండ పాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ యర్రగొండపాలెం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ వేగినాటి కోటయ్యని వారి అడుగుజాడల్లో నడిచి అయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. స్వర్గీయ వేగినాటి కోటయ్య , వద్లమూడి వెంకట సుబ్బయ్య విగ్రహాలను ఆవిష్కరించడం చాలా సంతోషాదాయకమని, వారు చేసిన మంచి పనులను ప్రతి ఒక్కరూ గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్మ సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటరావు, వేగినాటి శ్రీను, బీజేపీ కన్వీనర్ యనుముల నాగేశ్వరావు, మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, జనసేన అధ్యక్షులు ఆకుల రమేష్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# పిచ్చి చెట్లు తొలగింపు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 8)
మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పొదిలి పట్టణంలోని రహదారుల వెంట పిచ్చిచొట్ల తొలగింపు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యేగా కందుల నారాయణరెడ్డి ఎన్నికైన వెంటనే అభివృద్ధి పనులు మొదలుపెట్టారు. చర్చి సమీపంలో చిల్ల చెట్ల తొలగించేందుకు కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాటూరి నారాయణ ప్రతాప్, ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, నాయకులు బుచ్చిబాబు, కాలేషా, మౌలాలి, యాసీన్, సురేష్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మారుతీరావు, మున్సిపల్ సిబ్బంది తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తూర్పుకంభంపాడు ఉన్నత పాఠశాల

## విద్యా కమిటీ చైర్మన్‌ల ఏకగ్రీవ ఎన్నిక



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 8)
నెల్లూరు జిల్లా చేజర్ల మండలం తూర్పు కంభంపాడు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన విద్యా కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న మూడు ప్రభుత్వ పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్ లను ఏకగ్రీవం ఎంపిక జరిగింది. జిల్లా పరిషత్ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ తాటికొండ శ్రీహరి వైస్ చైర్మన్ ఎన్ సంపూర్ణ ప్రాథమిక పాఠశాల(హెచ్ డబ్ల్యు) చైర్మన్ నాగిపోవు తిరుపాలు వైస్ చైర్మన్ ఇండ్ల బాల చెన్నమ్మ ప్రభుత్వ పాఠశాల (మెయిన్) చైర్మన్ తాటికొండ హరిబాబు వైస్ చైర్మన్ గందల్ల అరుణ ఎంపికయ్యారు. తూర్పుకంభంపాడు పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులు ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏకగ్రీవం అయ్యేందుకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ అన్నలూరు శ్రీనివాసులు నాయుడు, కొమ్మి రమేష్ నాయుడు, నెలకొండ శ్రీనివాసులు నాయుడు, సప్పిడి వెంకటేశ్వర్‌ల నాయుడు, మలినేని పెంచలనాయుడు కృషి చేశారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లకు వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ కృష్ణయ్య, ఏ అంకయ్య, పి సురేష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న సింగరాయకొండ ఎస్ఐ శ్రీరామ్

## ఆర్టీసీ బస్టాండ్ వద్ద క్షతగాత్రురాలకి అండగా నిలిచిన పోలీసులు
## హుటా హుటిన 108వాహనంలో కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు
## వైద్యం చేస్తుండగా మృతి చెందిన మహిళ
## ప్రజల ప్రశంసలు అందుకుంటున్న సింగరాయకొండ పోలీసులు



(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, ఆగస్టు 8)
సింగరాయకొండ పట్టణంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కి తూర్పు బాగానే ఉన్న మసీద్ ప్రాంగణం వద్ద గురువారం ఒంగోలు వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఏపీ 27 జెడ్ 02 8 7 అనే నెంబర్ గల ఆర్టీసీ బస్ డిపోలోకి వస్తున్న సమయంలో పక్కనే ఉన్న ఈశ్వరమ్మకు అనుకోకుండా ప్రమాదం జరగడంతో ఆమె తనకు బలమైన గాయం తగిలి, బస్సు ఎడమవైపు వెనుక చక్రం తగలడంతో ఆమె శరీరానికి బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సింగరాయకొండ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీరామ్ వెంటనే తన సిబ్బందిని సంఘటనా స్థలం వద్దకు హుటాహుటిన తీసుకు వెళ్లి క్షతగాత్రురాలికి అండగా నిలిచి మానవత్వం చాటుకున్నాడు. సింగరాయకొండ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీరామ్ పట్ల , సిబ్బంది పట్ల ప్రత్యేకంగా మండల ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే జరుగుమల్లి మండలం కే బిట్రగుంట గ్రామపంచాయతీకి చెందిన యాదగిరి ఈశ్వరమ్మ అనే మహిళ తన గ్రామం నుంచి సొంత పనులు నిమిత్తం సింగరాయకొండకు రాగా ఆర్టీసీ బస్టాండు వద్ద రోడ్డు ప్రమాదం జరగడంతో ఈ విషయం తెలుసుకున్న వారి కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. క్షతగాత్రురాలని ప్రమాదం జరిగిన చోట స్ట్రక్చర్ ద్వారా సింగరాయకొండ ఎస్సై శ్రీరామ్, పోలీసులు స్వయంగా ఆమెను 108వాహనంలోకి చేర్పించి హుటా హుటిన వాహనం నడిపే డ్రైవర్‌కు వెంటనే కందుకూరు ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లాలని హుకుం జారీ చేశారు. సింగరాయకొండ పోలీసులు సూచనలు, సలహాలు మేరకు 108 వాహనం డ్రైవర్ ఆగమేఘాల మీద కందుకూరి ఏరియా ఆసుపత్రికి తీసుకు వెళ్లాడు. దురదృష్టవశాత్తు కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం యాదగిరి ఈశ్వరమ్మకి వైద్యం అందిస్తున్న సమయంలో అనుకోకుండా ఒక్కసారిగా ఆమె ప్రాణం కోల్పోయింది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బంధువులు వారి కంటతడిని ఆపేవారు లేరు. ఏది ఏమైనా గురువారం సింగరాయకొండ ఎస్సై శ్రీరామ్, పోలీసులు క్షతగాత్రురాలకి సంఘటనా స్థలం వద్ద చేసిన సహాయంపై మానవత్వం చాటుకున్నారని సింగరాయకొండ పోలీసుల పట్టణ ప్రజలు ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేసును ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.





# వై పాలెం కస్తూరిబా స్కూల్ చైర్మన్‌గా మర్రిరాజ కోటేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, ఆగస్టు 8)
యర్రగొండపాలెం కస్తూర్బా స్కూల్లో గురువారం జరిగిన పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎన్నికల్లో పుల్లలచెరువు మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన మర్రి రాజ కోటేశ్వరరావును స్కూల్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను స్కూల్ సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ రాజా కోటేశ్వరరావు మాట్లాడుతూ స్కూల్ అభివృద్ధికి నా శాసక్తులకు కృషి చేసి స్కూల్ డెవలప్మెంట్‌కు నా సహాయ, సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు.

# వరదయ్యపాలెం జెడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా ఉదయ్ కుమార్, వైస్ చైర్మన్ సుగుణ



(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, ఆగస్టు 8)
తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలంలో జెడ్పీ హైస్కూల్‌లో పాఠశాలలు అభివృద్ధి పథంలో నడిపించేందుకు పాఠశాల నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. నూతన కమిటీ ఎన్నికైన చైర్మన్‌గా ఉదయ్ కుమార్ (అమరన్ బ్యాటరీ) వైస్ చైర్మన్‌గా సుగుణ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జడ్పీ హైస్కూలు హెచ్ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, పాఠశాలలో చదువుతున్న విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నెల్లూరు ప్రభుత్వ సంగీతం నృత్య పాఠశాల జిల్లాకే తలమానికం

## జనసేన నాయకులు గునుకుల కిషోర్









(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 8)

మన సంస్కృతులను కళలను మరిస్తే మనల్ని మనం మర్చిపోయినట్లేనని జనసేన నాయకులు గునుకుల కిషోర్ అన్నారు. బాహాటంగా ఉంచాల్సిన మహాకవి తిక్కన కాంస్య విగ్రహం నిరుపయోగంగా పరదాలు కప్పబడి ఈ కళాశాలలో ఉంది. ఒకే రాజకీయ నాయకుడి విగ్రహాలు పలు ప్రదేశాల్లో దర్శనమిచ్చే స్థానాలలో మహాత్ముల విగ్రహలను పెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మన సంస్కృతులను కాపాడుతూ ఇప్పటికీ 380 కళాకారుల శిక్షణతో కలకలలాడుతున్న డా.ఎస్పీ బాలసుబ్రమణ్యం ప్రభుత్వ సంగీతం నృత్య పాఠశాలకి సొంత భవనం లేకపోవడం ఆలోచించాల్సిన విషయమేనన్నారు. జనసేన అధ్యక్షులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి ఈ కళాశాలను తీసుకు వచ్చి వీటి సౌకర్యాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మన సంస్కృతిని ప్రతిబింబించే కళలు శిక్షణ ఇస్తున్నారని అందరికీ తెలియక పోవచ్చన్నారు. 50.సం.ల నుండి ఇంకా ఉచితంగా శిక్షణ ఇస్తున్నారని అవగాహన కల్పించడం కూడా ముఖ్యమేనన్నారు. అరుదుగా కనపడే వీణా మృదంగం పరికరాలు 50 కి పైగా కళాశాల ఉన్నప్పటికీ శిక్షకులు లేకపోవడంతో ఎంతో మందికి ఆసక్తి ఉన్నా ఆ విద్యను అభ్యసించలేకపోతున్నారు.పిల్లలలో సృజనాత్మకతను పెంపొందించగల కళలకు అవసరమైన శిక్షకులను ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకునే విధంగా చర్యలు చేపడుతామన్నారు. జిల్లా నలుమూలల నుంచి కళలు యందు ఆశక్తి గల యువకులు ఎవరైనా సర్టిఫికెట్లు పొందాలంటే ఇక్కడికి రావాల్సిందే కాబట్టి...సౌకర్యాల మెరుగుపరిచి ఈ మధ్యనే ఖాళీ అయిన డిఆర్డిఏ భవనం లాంటివి పరిశీలించి వీటికి సొంత భవనం ఏర్పాటు చేసి కళలను పెంపొందించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. పిల్లలకు ఐదారు సంవత్సరాలప్పుడే వారి గాత్రాన్ని ట్యూన్ చేయగలమన్నారు. ఆ వయస్సు శిక్షణ పొందుతూ అనేక విశిష్ట అవార్డులు కలెక్టర్లు ముఖ్యమంత్రులు చేత పొందిన విషయాన్ని గుర్తు చేస్తూ విద్యను అభ్యసించే సమయం 10 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల అయినప్పటికీ విద్య చదువుకునే సమయానికి అడ్డం లేకుండా శిక్షణ ఇస్తున్న తరగతుల్లో 6ఏళ్ళ పిల్లలకు స్పెషల్ కేర్‌తో హాజరయ్యే వెసులుబాటు కల్పించవలసిందిగా కోరారు. ఒకటో తరగతి ముందు ఎల్కేజీ యూకేజీ ప్లే క్లాస్‌లో ఉన్నట్లే పిల్లలను 6 సంవత్సరాల నుంచి ట్యూన్ చేస్తే ఉన్నత కళాకారుగా రూపుదిద్ది మహోన్నత కళాకారులుగా చేయవచ్చని వారి అభిప్రాయం ప్రభుత్వం దీన్ని పరిశీలించాల్సి ఉందన్నారు. చదువుకునే పిల్లలకు ఆటంకం లేకుండా ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటలకు సాయంత్రం నాలుగు నుంచి ఏడు గంటల వరకు శిక్షణనిస్తూ మన సంస్కృతుల్ని కాపాడుతున్న ఈ ప్రభుత్వ సంగీతం ఇచ్చే పాఠశాలకు ఆదరణ కరువైందని చెప్పాలి. దాదాపు అయిదు దశాబ్దాల కిందట కోటలో నలపరెడ్డి శ్రీనివాసరెడ్డి సహృదయంతో స్థాపించబడిన ఈ సంగీత,నృత్య పాఠశాల కళలకు ఉన్న ఆదరణను బట్టి ఆయా ప్రభుత్వాలు నెల్లూరు జిల్లాకు కేంద్రం కు తరలించారు. అప్పటి నుండి ఎంతోమంది మహనీయ నృత్య సంగీత కళాకారులు అచార్యులు, ప్రధాన అచారులుగా ఇందులో చేరి ఎంతోమంది విద్యార్థుల కీర్తి ప్రతిష్టలకు, అవార్డులకు రివార్డులకు కారణభూతులై ఉన్నత స్థానానికి తీసుకువచ్చారన్నారు. ఏటా 500 మంది విద్యార్థులతో గాత్రం, వాద్యం, వయోలిన్, వీణామృదంగం, నాదస్వరం, డోలు, నృత్యం, భరతనాట్యం వంటి వివిధ విభాగాలలో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌లతో తన ప్రతిభ చాటుకుంటుందన్నారు.

## కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి ఇన్వర్టర్ బహూకరణ



(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఆగస్టు 8)

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో స్టడీ సమయాల్లో విద్యుత్తు కోతల వలన బాల,బాలికలు పడుతున్న అవస్థలను చూసిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ఇన్చార్జి ప్రిన్సిపల్ ఇందిరా సుహాసిని మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు రైల్వే కాంట్రాక్టర్ గంటా శ్రీనివాసరెడ్డిని సహాయం కోరగా పాఠశాలను సందర్శించి 36వేల రూపాయల సొంత నిధులు వెచ్చించి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి ఇన్వర్టర్ బహుకరించారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి మా వంతు సహాయ,సహకారాలు అందిస్తానని తెలిపారు. ఇన్వర్టర్ బహూకరించిన గంట శ్రీనివాసరెడ్డికి ఇంచార్జి ప్రిన్సిపల్ ఇందిరా సుహాసిని ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ ఉడుముల సుబ్బారెడ్డి, కత్తి తిరుపాల్, గాయం కృష్ణారెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, కత్తి కిషోర్,సుమిత్ర తిరుపతిరెడ్డి, రాజా రామిరెడ్డి పాల్గొన్నారు..

## సునామీని తలపించిన విద్యా కమిటీ ఎన్నికలు

### 53 పాఠశాలలను కైవసం చేసుకున్న టీడీపీ బలపరచిన అభ్యర్థులు

(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, ఆగస్టు 8)







మండలంలో ప్రాథమిక ప్రాథమిక ఉన్నత పాఠశాలలు 54 గాను తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థులు 53 పాఠశాలలు కైవసం చేసుకుని సునామీని తలపించేలా ఎన్నికలు జరిగాయి. రావెళ్ల వారి పాలెం మినహా అన్ని పాఠశాలల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌లు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం మర్రిపూడి మండల చరిత్రలో ఇదే మొదటిసారి అని కూడా చెప్పాలి. జడ్పీ హైస్కూల్ మర్రిపూడి, గార్లపేట, తంగెళ్ల, కాకర్ల కూడా తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. ఇదిలా ఉంటే మండల కేంద్రమైన మర్రిపూడి జడ్పీ హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్‌గా పూర్వపు విద్యార్థి ఉప్పు సాయిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో విద్యార్థిగా చదువుకొని ఇదే పాఠశాలలో చైర్మన్‌గా ఎన్నిక కావడం నాకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. తనకు సహకరించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. మర్రిపూడి ఏఏ ప్రాథమిక పాఠశాల ఎస్సీ కాలనీ విద్య కమిటీ ఎన్నికలు గ్రామ పెద్దలు నిర్ణయం మేరకే కట్టుబడి చైర్మన్‌గా గురిజాల సురేష్, వైస్ చైర్మన్ గా గండి అన్నమ్మలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాఠశాల కన్వీనర్‌గా ప్రధానోపాధ్యాయురాలు వయోల వ్యవహరించి 15 మంది కమిటీ సభ్యులను గ్రామ పెద్దల సమక్షంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఆమె తెలిపారు. ఎన్నిక ఏకగ్రీవంగా జరగడంతో చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులకు గ్రామ పెద్దలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినిలు ఎస్ నందివర్ధనమ్మ, ఏ సత్యవతి, సిహెచ్ కోటేశ్వరమ్మ, మండల తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు గురిజాల పోలయ్య, గ్రామ పెద్దలు గురిజాల ఆమోస్, గురిజాల కాటయ్య, గురజాల బాబురావు, గురిజాల రాజు, గురిజాల ప్రసాద్, కొంద్రు హనూక్, కొంద్రు జాన్, కొంద్రు రూబెన్, గండి నోవాహు, విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఒంగోలు వద్ద విమానాశ్రయం నిర్మించాలి

### పార్లమెంటులో కోరిన ఎంపీ మాగుంట



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 8)

ప్రస్తుతం జరుగుచున్న పార్లమెంటు సమావేశాల్లో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి సివిల్ ఏవియేషన్ బిల్ సందర్భంగా మాట్లాడుతూ 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు వుండగా, పదేళ్లలో రెట్టింపయి ప్రస్తుతం 150 ఉన్నాయని, దేశంలో 75 శాతం ప్రయాణీకులు కేవలం 3 కంపనీల విమానాలోనే ప్రయాణం చేసున్నారని తెలిపారు. గతంలో తక్కువ ధరలో విమాన ప్రయాణం అందుబాటులోకి వచ్చి మధ్యస్థ, సామాన్యులు ఉపయోగ పడింది. తరువాత డిమాండ్ ఆధారిత రేట్ల అనుమతితో టిక్కెటు ధరలు బాగా పెరిగి సామాన్యులు విమాన ప్రయాణానికి దూరమయ్యారు. గతంలో ఉడాన్ పథకం ద్వారా దేశంలో చిన్న నగరాలకు విమాన సదుపాయం ఏర్పడి సామాన్యులకు బాగా ఉపయోగపడింది. దేశంలో చిన్న విమానాశ్రయాలు ఎక్కువ ఏర్పాటు చేసిన యడల మరిన్ని కంపెనీలు వచ్చి సామాన్య ప్రజలందరికి ఎక్కువ ఉపయోగంగా ఉంటాయని, కావున చిన్న విమానాశ్రయాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో 5 నూతన విమానాశ్రయాలను ఏర్పాటు చేయాలని ప్రకటించారు. 20 సంవత్సరాల క్రితం ఒంగోలుకు ఒక విమానాశ్రయం ఏర్పాటుకు పంపిన ప్రతిపాదనలపై విమానయాన అధికార బృందం కూడా ఒంగోలు వచ్చి 650 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రతిపాదనలను డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ , ఎయిర్ పోర్ట్స్ ఆధారిటీ ఆఫ్ ఇండియాలు ఆమోదించాయి. కేంద్రం 60 శాతం రాష్ట్రం 40 శాతం నిధులతో చిన్న విమానాశ్రయాలను నిర్మిస్తే సామాన్యులకు ఉపయోగంగా ఉంటుంది. ఒంగోలు పార్లమెంటు పరిధిలో ఒంగోలు వద్ద విమానాశ్రయాన్ని నిర్మించాల నేది ప్రకాశం జిల్లా ప్రజల చిరకాల వాంఛయని, కావున ఒంగోలుకు ఒక విమానాశ్రయాన్ని మంజూరు చేసి వెంటనే నిర్మించాలాని కేంద్ర విమానయాన శాఖ మంత్రిని ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి కోరారు.

## తోకపల్లి ఎస్సీ పాలెం ప్రాథమిక పాఠశాల టీడీపీ మద్దతుదారుల కైవసం



(జేణ్ముఖ్వ్‌లుగు, పెద్దారవీడు, ఆగణ్టు 8)

పాఠశాల కమిటీ చైర్మన్ గా ఉప్పలపాటి మేరీ ఎన్నిక -వైస్ చైర్మన్‌గా ఉప్పలపాటి శాంతి కుమారి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ ఎం వెంకట నారాయణ, మాజీఎంపిటిసి చిన్నయేసయ్య, చిన్న శేషయ్య, ఆనంద్ కుమార్, జాన్ రావు, నాగరాజు పాల్గొన్నారు.

## డక్కిలి హైస్కూల్ చైర్మన్‌గా దండోలు వెంకటరమణ రెడ్డి



(షణ్ముఖ వెలుగు, డక్కిలి, ఆగస్టు 8)

స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ కి సంబంధించి జరిగిన ఎన్నికల విభాగంలో డక్కిలి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా దండోలు వెంకటరమణ రెడ్డి, అదేవిధంగా వైస్ చైర్‌పర్సన్‌గా పొట్టెల్లా శాంతమ్మని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, చెలికం నరేష్ రెడ్డి, డక్కిలి చంద్రారెడ్డి, దండోలు రత్నాకర్ రెడ్డి, వేముల నాగయ్య నాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, స్కూల్ పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## కడపరాజుపల్లె పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్ ఏగ్రీకం



(షణ్ముఖ వెలుగు, పెద్ద దోర్నాల, ఆగస్టు 8)

మండలంలోని మేజర్ పంచాయతీ పరిధిలోని కడపరాజుపల్లె (గ్రామం) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నాడు విద్యా కమిటీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు ఏగ్రీకంగా ఎన్నుకున్నారు. విద్యా కమిటీ చైర్మన్ యలకపాటి అంకారావు,వైస్ చైర్మన్ బోగెం జ్యోతి,లను ఎన్నుకున్నారు. విద్యా కమిటీ చైర్మన్ యలకపాటి అంకరావు మాట్లాడుతూ నన్ను ఏగ్రీకంగా ఎన్నుకొని చైర్మన్ చేసినందుకు టిడిపి నాయకులకు, గ్రామ ప్రజలకు,కార్యవర్గ సభ్యులకు,ప్రతి ఒక్కరికి నా తరఫున శుభాకాంక్షలు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కర్రావుల వెంకయ్య, ఆత్మకూరి మల్లారెడ్డి, బోళ్ల కాశిరెడ్డి,కర్రావుల రాజేంద్ర,జేనిగొర్ల రాజయ్య, బోగెం వెంకట రాములు, ఆత్మకూరి యోగి రెడ్డి,ఆత్మకూరి రామచంద్రారెడ్డి, గోనుగుంట్ల రాజులు, ఆత్మకూరి కిచ్చా రెడ్డి, బోళ్ల రంగారెడ్డి, వనపర్తి చిన్న నాగరాజు, గోన దేవరాజు,కార్యకర్తలు,అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## నవోదయలో ప్రతిభ కనబరిచిన లుంబిని విద్యార్థి

(షణ్ముఖ వెలుగు, చేజర్ల, ఆగస్టు 8)



జవహర్ నవోదయ విద్యాలయ సమితి 6వ తరగతి 2024- 2025 సంవత్సరానికి ఎంట్రన్స్ టెస్ట్ లో చేజర్ల మండల లుంబిని విద్యాలయ విద్యార్థి కె.యశ్వంత్ సీటు సాధించడం జరిగిందని పాఠశాల కరస్పాండెంట్ బి.రమేష్ తెలిపారు. మా విద్యార్థులు ఏ కాంపిటేటివ్ పరీక్షలనైనా తట్టుకునే విధంగా వాటిలో సీటు సాధించే విధంగా బోధిస్తున్న మా ఉపాధ్యా యులకు అభినందనలు తెలిపామని తెలిపారు. అలాగే మండలంలో కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌లలో పోటీపడి ఇటీవల అనేక ర్యాంకులు సీట్లు సాధించిన ఘనత మా పాఠశాలకు దక్కడం నాకు చాలా ఆనందంగా ఉందని తెలిపారు. తల్లిదండ్రులు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని అందుకు నిదర్శనమే ఈ ఫలితాలు అని వారు పేర్కొన్నారు. కార్పొరేట్‌తో దీటుగా విద్యను బోధిస్తున్నామని తెలిపారు.